
శ్రీసచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై! సద్గురు శ్రీసాయినాథుని శరద్బాబూజీ కీ జై!

# గురుకృప

## శ్రీరామనవమి సంచిక



కైవల్యపదము కాశీ..

మూర్తీభవించిన అనుగ్రహరాశి....

# సత్సంగ సుమాలు



**గురుబంధువు:** గురువుగారూ, సత్సంగంలో ఎవరైనా ప్రిన్సిపుల్‌కి వ్యతిరేకంగా చేస్తున్నారు అనిపించినపుడు, ఎందుకు ఇలా చేస్తున్నారు. గురువుగారికి ఇది ఇష్టం ఉండదు కదా అని వాళ్ళని అడగవచ్చా? లేదంటే mind your own business అని మీరు చెప్పారు కదా అని కామ్‌గా ఉండాలా?

**గురువుగారు:** నాకొక ఉదాహరణ చెప్పయ్యా...

**గురుబంధువు:** సత్సంగం జరిగేటప్పుడు ఎవరైనా కొత్తవాళ్ళు వచ్చినప్పుడు వాళ్ళు బాబా దగ్గర డబ్బులు పెడ్తారు సార్. అప్పుడు మనం వెళ్ళి, ఇట్లా గురువుగారికి ఇష్టం ఉండదు, మీ డబ్బులు మీరు తీసుకెళ్ళండి అని ఇచ్చేసాననుకోండి. ప్రక్కన ఇంకొకరు వచ్చి, వాళ్ళు బాబా భక్తులు అలా చెప్పకూడదు, వాళ్ళు హర్ట్ అవుతారు అని చెప్పారనుకోండి... అప్పుడు...

**గురువుగారు:** ఏదైనా చెప్పే పద్ధతి మీద ఆధారపడి ఉంటుంది. మనసుని నొప్పించకుండా చెప్పండి. అంతే! ఇప్పుడు ఆ పెట్టేటటువంటి వాళ్ళు ఏదో మీ ప్రిన్సిపుల్స్‌కి వ్యతిరేకంగా పోయినట్టు ఏం కాదు కదా? దాని కోసం కాదు కదా వాళ్ళు పెట్టింది. తెలియక పెట్టారు. అంతే దానికి సింపుల్‌గా చెప్పాల్సిన పద్ధతిలో చెప్పండి. ఇప్పుడు డబ్బులు పెట్టారు కదండీ, ఏం చేయమంటారు ఆ డబ్బులతో అని వారిని అడగండి. ప్రసాదం కోసం పెట్టాను అంటారు. మరొకసారి వచ్చేటప్పుడు మీరు తెస్తే తృప్తిగా ఉంటుంది కదా సార్. నెక్స్ట్ వీక్ వచ్చేటప్పుడు చక్కగా మీరే ప్రసాదం తీసుకురండి, హ్యాపీగా ఉంటుంది, మీకు, మనస్సుకు తృప్తిగా ఉంటుంది... అని మర్యాదగా చెప్పండి. ప్లీజింగ్‌గా చెప్పండి, హర్టింగ్‌గా ఎందుకు చెప్పాలి? మీరేదో ప్రిన్సిపుల్స్‌కి గార్డియన్స్ లాగా, వాళ్ళందరూ బ్రేకర్స్ లాగా ఫీల్ అవ్వడం ఎందుకు? ఆ ఫీలింగ్ తప్పు. చెప్పేటువంటి పద్ధతుల మీద ఆధారపడి ఉంటుంది.

నేను శిరిడీలో ఉండేటప్పుడు ఊదీ ఇచ్చే రోజున క్యూలో వచ్చేవాళ్ళకి ఎంతోమంది చెప్తూ ఉండేవాళ్ళు, గురువుగారి దగ్గర డబ్బుల్లాంటివి పెట్టకూడదు అని. అక్కడ బాబా ఫోటో ఉండేది. ఎక్కడెక్కడి వాళ్ళో వచ్చేవారు, వాళ్ళెవరో కూడా మనకు తెలియదు. వచ్చి అక్కడ డబ్బులు పెట్టేసి వెళ్ళిపోయేవారు. ఎవరైనా చూస్తే చెప్పేవాళ్ళు... కానీ తిరిగి చూస్తే ఇంకా కొద్దిగా ఉండేవి. ఆ డబ్బులన్నీ తీసుకొనివెళ్ళి సమాధి మందిరంలో వేసి రండి అని చెప్పేవాణ్ణి. అంతే. సింపుల్. వాళ్ళు బాబాకి సమర్పించారు. మనమూ బాబాకే సమర్పిస్తాం. అయిపోతుందిగా? దానికి సామరస్యంగా ప్రయత్నం చెయ్యండి. ఒకసారి పొరపాటు జరిగితే రెండవసారి ప్రయత్నం చెయ్యండి. ఎవ్వరినీ హర్ట్ చెయ్యకూడదు. ఎవ్వరి మనస్సునీ నొప్పించకూడదు. వాళ్ళల్లో ఉండేది కూడా బాబానే! వాళ్ళు బాబా భక్తులు కాకపోయినా సరే నొప్పించకూడదు. వాళ్ళు బాబా భక్తులు కదా వాళ్ళని నొప్పించకూడదు అనే మాట కూడా తప్పు. బాబా భక్తులు కాకపోయినా నొప్పించకూడదు. అదీ నేను చెప్పేది. ఎవరినైనా సరే ఎందుకు నొప్పించాలి? నొప్పించకుండా చెప్పడానికి ప్రయత్నం చేయండి. ఈ నొప్పించడాలూ,

సంపుటి : 23
సంచిక : 2

ఏప్రిల్ 2
2020



# గురుకృప



## సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి!
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయకుహరంలోని నిశ్శబ్దనిశీధిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞానసౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞానసౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృతధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృతధారలలో తడుస్తూ, ఆ జ్ఞానసౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏకకంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధురస్వప్నం.
ఆ స్వప్నసాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్యప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది.

– శ్రీబాబూజీ

## లోపలి పేజీలలో



4 పథగామి – గురుకృప
8 చిన్న ప్రశ్న – శ్రీమద్భాగవతము దివ్యజీవన మార్గము
15 గురుకృపాలహరి – గురుకృప
22 ఈ మార్గం ఎటు వెళ్తుంది? – కంచి పరమాచార్య వైభవం
25 మృష్టాన్న భోజనం – శ్రీమఠం బాలు
24 Principle? or Emotion? – శ్రీబాబూజీ
27 ఆ చేయి ఎంత హాయి – డా॥ జి. సాయివరప్రసాదరావు

నిర్వహణ : గురూజీ ఆశీస్సులతో – గురుబంధువులు

GURUKRUPA

Printed at : Ramakrishna Printers, Visakhapatnam. Web : www.gurukrupa.info



# పథగామి

ఇదిగో మనం ఈ శీర్షిక చదువుకునే సమయానికి 235 దేశాల్లో 779 కోట్ల జనాభా ఉన్నట్లు ప్రపంచ జనాభా గడియారపు సూచీ ఘంటికలు మ్రోగిస్తోంది. కేవలం సౌరవ్యవస్థలో ఉన్న ఎనిమిది లేదా తొమ్మిది గ్రహాలు కాక ఇంకా విశాల విశ్వంలో ఉన్న గ్రహాలు, ఉపగ్రహాలు.... ఇలా చెప్పుకుంటూపోతే... అయ్యో! గురువు అనుగ్రహం గురించి గురుతు చేసుకుందామనుకుంటే – ఇతన్ని ఏ 'గ్రహమో' పట్టి పీడిస్తున్నట్లుంది అని మీరు అనుమానించే అవకాశం ఉంది. మిమ్మల్ని ఇబ్బందుల పాలు చేయనులెండి. ఈ విశాల విశ్వంలో మనిషిగా జన్మించడమే మహాద్భుతం. ఎందుకంటే మనిషికి ఒక్కడికే తాను సాధించాలనుకునే లక్ష్యాన్ని చేరే ప్రయత్నం చేసే అవకాశం ఉంది. ఇక్కడ 'ప్రయత్నం' ఎందుకన్నారు అంటారేమో! 'ప్రాప్తి' అనేది మనిషికి – మనిషికి మారుతుంటుంది కదండీ! రమారమి సెకనుకు ఒకరు జన్మించే భారతదేశంలో ఉన్న మనకు ఎంత ఋణానుబంధం లేకపోతే, గురుచంద్రునితో అవ్యాజ ప్రేమానుబంధం కాకపోతే "శ్రీసాయివంటి దైవం లేడులేడని" గుర్తించగలుగుతామో ఒక్కసారి ఆలోచిద్దాం. శ్రీసాయినాథుని వంటి అనంతానంత ప్రేమసాగరం చెంతన కూర్చోగలుగుతామో ఇంకోసారి పరికించుకు చూసుకుందాం. శ్రీసాయి గురించి పదాలు, భావాలు, ఆలోచనలు ఏవీ వ్యక్తం చేయలేని ఈ క్షణాల్లో ఒక్కరిమాటే వేదం. ఆ అపరిమిత తత్త్వం గురించి చెప్పగలిగింది ఆ సత్ప్రేమ మూర్తి ఒక్కరే – శ్రీసాయినాథుని శరత్ బాబూజీ. ఇదిగో వారిలా అంటారు. **"పరిపూర్ణ దివ్యత్వం ధరించిన మానుషరూపమే – శ్రీసాయిబాబా! అవధులు లేని దైవశక్తి పాంచభౌతిక దేహం యొక్క పరిధులలో ఎంతవరకు ప్రకటం కాగలదోనన్న దానికి అవధియే శ్రీసాయిమహిమ".** అట్టి "పరిపూర్ణ దివ్యత్వాన్ని" దర్శించి, స్మరించగలగడమే ఒక గొప్ప విజయం మనకు – అక్కడితో ఆగిపోకుండా "ప్రాత:దర్శనం"లోనే మన లక్ష్యాన్ని మనకు గుర్తు చేస్తూ గురుదేవులు "సర్వప్రాణులలో పలికే సాయిని – విశ్వరూప దర్శనమివ్వమని" వేడుకుంటూ "అంతటా నిండిన సాయిని మనలో నిండిపొమ్మని, సాయి సత్స్వరూపాన్ని చూపమని", చూడమని తెలియచెప్పారు. "అసతోమా సద్గమయ। తమసోమా జ్యోతిర్గమయ। మృత్యోర్మా అమృతంగమయ।" – అసత్తు నుండి సత్తువైపు, చీకటి నుండి వెలుగువైపు, మృత్యువు నుండి అమృతత్వం వైపు నడిపించు – అంటూ దారిచూపుతుంది బృహదారణ్యకోపనిషత్తు. ప్రాచీన ఋషుల కాలం నుండి మానవ లక్ష్యాన్ని సాధించుకునేందుకు



ఉత్తేజాన్ని నింపిన ఉపనిషద్వాక్యాలకు – సజీవమైన సద్గురు వాక్యానికి తేడా ఏమంటే దారీ, తెన్నూ తెలీక మరో జన్మను వృధా చేసుకోకుండా పరిమితత్త్వమనే చీకటి నుండి అపరిమితత్త్వం అనే వెలుగువైపు, 'తాను' అనే చీకటి నుండి 'తనలో నిండిన సాయి' అనే వెలుగువైపు – సర్వప్రాణులలోనూ పలికేది 'తానే' (సాయి) అయితే 'తనతో' (సాయితో) ఉండడమే నిజమైన సత్తు అని తెలుసుకోవడం వైపు, తనలోనూ – ఎదుటివారిలోనూ వెలిగేది 'సాయి' మాత్రమే అని తెలియడం ద్వారా అమృతత్త్వం వైపు మనలను నడిపిస్తున్నారు గురుచంద్రులు శ్రీబాబూజీ. ఇక్కడంతా 'అసలుబేరమే' గానీ 'అరువుబేరం' లేదు. మన జీవిత లక్ష్యం – అందుకు వలసిన దిశానిర్దేశం – ఆ క్రమంలో అవసరమయ్యే సాధనా సంపత్తి –ఇలా ప్రతీఅంశము సుస్పష్టం. సాయి సద్గురువును తెలుసుకోవడమనే లక్ష్యం – ఎవరికి వారే 'ప్రేమ'తో వేసుకునే తనదే అయిన రహదారి – సత్సంగము, భజన, నామస్మరణ మరెన్నో 'సాధనా సోపానాలు'. ఆ ఆనందస్వరూపుని ఆంతర్యంలో నిలుపుకునేందుకు అమృతమూర్తి గురువు అందించిన అవకాశాలు అనంతం.... అందిపుచ్చుకుని అడుగు వేయాలని తపించడం మన సొంతం... ప్రస్తుతం మన స్థితిని మనం గమనించుకుంటే...

***ఎక్కడి మానుష జన్మము.... ఎత్తిన ఫలమేమున్నది....***

నవనాగరికత నాల్గుదిక్కులా విస్తరించింది. విజ్ఞానం వినువీధికెక్కి ఎన్నో వింతలు, క్రొత్త పుంతలు తొక్కుతోంది. ఉన్నది లేనట్లు, లేనిది ఉన్నట్లు మనిషికి చూపేంతగా కృత్రిమమేధ కనువిందు చేస్తోంది, మత్తుమందు వేస్తోంది. అయినా ఏదో వెలితి – ఏదో అభద్రతా భావం – అన్నీ ఉన్నా 'ఆనందం' లేని మానవ జీవిత అగాధం. "డబ్బు మీద మనసెట్టి – జబ్బు కూడబెట్టుకుంటున్న"వైనం, "మతాలనే మళ్ళలో – కులాలనే కుళ్ళులో" మ్రగ్గి, 'మనిషి' మృగ్యమైపోతున్న జీవన నిర్వేదం. చివరకు తానే మనిషిగా దిగివచ్చి **"నన్ను ఆనందస్వరూపునిగా ధ్యానించు – అదీ సాధ్యపడకపోతే నా రూపాన్ని ధ్యానించు" అని స్పష్టంగా, సూటిగా తెలియచెప్పిన సాఫల్య జీవన నినాదం.** పట్టువదలని విక్రమార్కునిలా 'మనిషి దైవంగా పెరగటం' తన మతంగా, చేయిపట్టుకు నడిపించడం, చివరికంటా గమ్యం చేర్చటమే అభిమతంగా – గురువుగా మనకోసం వస్తున్న ఆ దయాస్వరూపుని గుర్తించకపోతే ఎలా? వేసే అడుగులను గమనించుకోకపోతే మనలో మార్పు కలిగేదెలా? శ్రీపెదతిరుమలాచార్యులు ఇలా అంటారు "మరువను ఆహారంబును, మరవను సంసార సుఖము। మరవను ఇంద్రియభోగము



మాధవ నీమాయ। మరచెద సుజ్ఞానంబును, మరచెద తత్త్వరహస్యము। మరచెద గురువును దైవము మాధవనీమాయ।" అని. మన అంతరంగాన్ని సద్దర్శనం చేసుకోవాల్సిన మాటలు కదా ఇవి. వారికేమో బిడ్డలు దైవంగా పెరిగే క్రమం చూడాలని తపన – మనకేమో 'మనుషు'లుగా ఎప్పటికి ఎదగగలమన్న ఆలోచన. ఆశయానికి–వాస్తవానికి దూరం ఎక్కువగా ఉన్నట్లు తోస్తోంది కదా! సానుకూలంగా కన్పించడం లేదనిపిస్తోంది కదా! ప్రశ్నించే ఆ పరమాత్మ స్వరూపుడే–పరమదయాళువు కదా! పాపం" ఒక్క అడుగు వెయ్యరా! నేను నీకోసం పది అడుగులు వేస్తానురా" అని అభయమిచ్చాడు. కోటానుకోట్ల జీవుల్లో ఎంతమందికి ఇలాంటి అవకాశం వస్తుంది చెప్పండి! "ఒక్క అడుగా?" అమ్మో చాలా కష్టం – పేరుకే ఒక్క అడుగు గానీ ఎన్ని మతలబులు ఉండి ఉంటాయోనంటారా? చూద్దాం....

***లక్ష్యసిద్ధికి...త్రికరణ శుద్ధి***

"నన్నెవరయితే అనన్యంగా శరణంటారో వారి యోగక్షేమాల బాధ్యత నేను వహిస్తానన్న" జగద్గురు వాక్యం నుండి "నా భక్తులనెన్నటికీ పతనం కానివ్వను – వారిని చివరకంటా గమ్యం చేరస్తానన్న" సమర్ధ సద్గురుని వాణి వరకు గురువు సదా అప్రమత్తంగానే ఉంటున్నాడు మనల్ని ఉద్ధరించడానికి. అనన్యంగా శరణు అనాలంటే ఆయన వారమని తెలియాలి - I belong to Baba - Baba belongs to me – నేను సాయికి చెందిన వాణ్ణి – సాయి నాకు చెందిన వారని త్రికరణశుద్ధిగా విశ్వసించాలి. "లక్ష్యాన్ని పరిపూర్ణం చేసుకోవడానికి ఎంతో దూరంగా ఉన్నాననిపిస్తోంది" అన్న ఒక భక్తునితో గురువుగారంటారు **"మనం చెప్పిందే చెయ్యాలి, ఆ రెండూ ఒక్కటే కావాలి. మనం చెప్పే మాటలు, మనం చేసే పనుల మధ్య ఉన్న దూరం మన నిరాశకు కారణమవ్వచ్చు. కొంతమంది వారి మాటలకు, చేతలకు మధ్య దూరాన్ని తగ్గించుకోవడానికి ప్రయత్నిస్తారు, మరికొంతమంది సొంతం ఆ ప్రయత్నమే వదిలేస్తారు. ఇక ఆ ప్రయత్నమే వదిలేస్తే అసలు దూరం అనే ప్రశ్న రాదు. (గురువుగారు నవ్వుతూ....) మీలో ఆ అంతరాన్ని తగ్గించుకోవాలనుకొనే వారు ఆలోచనలను, మాటలను, చేతలను ఒకేవిధంగా ఉండేలా చూసుకోవడం, అంటే వాటి మధ్య విభేదం లేకుండా చేసుకోవడమే కీలకాంశం. శాస్త్రాలు చెప్పేది ఇదే. మనమేం చేసినా త్రికరణ శుద్ధిగా చేయాలి – ఆలోచన, మాట, క్రియ, ఎప్పుడైతే ఈ మూడు ఒక్కటవుతాయో, అది సరైన క్రియ. లేకపోతే అది ఆత్మవంచనకు దారితీసి మనలో నిరాశా నిస్పృహలకు, మరింత ఆత్మవంచనకు అవకాశం కల్పిస్తుంది".**



ఎప్పుడయితే మనసు, మాట, చేత ఒక్కటవుతుందో "మనసు మబ్బులు మాటు మురిపించే ఆ మోము" స్పష్టంగా దర్శనమిస్తుంది. ఈ ఒక్క అడుగు వేయలేమా? ఈ విశాల విశ్వంలో మనల్నే ఎంచుకుని ప్రతీక్షణం కాచుకుంటున్న ఆ దివ్యమూర్తికి ఒక్కసారే పుట్టి, ఒక్కసారే మరణించే, ఈ ఒక్కసారి దేదీప్యంగా వెలిగే ఒక ఆరని జ్యోతిని, త్రికరణాలను ఏకం చేసుకుని ఒకే ఒత్తిగా మన 'ప్రేమను' చమురులా వెలిగించి, ఆ మంగళ స్వరూపుని పాదాల చెంత పెట్టుకోలేమా? అడిగి చూద్దాం **–"గురుదేవా! మీ కరుణార్ద్రక్కులు మాపై వర్షించి మా త్రికరణాలలోనూ మీరే నిలిచిపోండి. అణువణువూ మీ తలపులతో నిండిన ఈ తనువు తాము చూపిన బాటలో నడిచి తరించాలని దీవించండి"** అని వినమ్రంగా వేడుకుందాం....

***ఆత్మవంచన లేని ఆధ్యాత్మికత.... సద్గురు కీర్తి పతాక....***

ప్రాపంచిక అవసరాలు తన ఆధ్యాత్మిక లక్ష్యం నుండి ప్రక్కకు మరలేలా చేస్తున్నాయని వాపోయిన భక్తునితో గురుదేవులు ఇలా అన్నారు – **"డబ్బు సంపాదించడం, ఆస్తులు ఉండటం మంచిది కాదని నేను చెప్పడం లేదు, అదేమీ తప్పుకాదు. కానీ ఆ విషయాన్ని ఒప్పుకోండి. నిజం చెప్పండి. "నేను చాలా ఆధ్యాత్మిక వ్యక్తినని, కేవలం ఆధ్యాత్మిక సాధనలోనే ఉండాలనీ అనుకొన్నాను. కానీ అది నిజం కాదు. నాకు నిజంగా కావలిసింది కొంచెం భూమి, ఒక మంచి సౌకర్యమైన ఇల్లు, దండిగా డబ్బు, నా అప్పులు తీరే మార్గం". మీకు నిజంగా కావాల్సిందది, బాబాను దానికోసం స్పష్టంగా అడగండి. బాబా ఇస్తారు. అప్పుడు మీరు ఆనందంగా ఉంటారు. అప్పుడు అక్కడ అటువంటి అంతరమూ ఉండదు, సంఘర్షణ ఉండదు, వైరుధ్యం ఉండదు, అపరాధభావన ఉండదు, ఆత్మవంచన ఉండదు – అది మంచిది".** సద్గురుతత్త్వం అంటేనే సరళము, సులభము, స్పష్టము, సౌమ్యము. ఎంత సులభం – మనల్ని మనలా ఉండమని వారిబోధ. ఇక్కడ కూడా మన 'దర్పాన్నే' చూపే ప్రయత్నం చేస్తామే కానీ – సద్గురువనే 'గతిశీల దర్పణంలో' మనల్ని మనం చూసుకుని మనలో లోపాలు సరిదిద్దుకునే యత్నం చేయగలుగుతున్నామా? ఆలోచిద్దాం. త్రికరణాలను సద్గురు చరణాలకు అంకితమిచ్చిన నాడు నిజమైన మనిషిగా తయారవుతాం. ఆకలిగొన్న జీవులలో ఆయన కనపడతాడు – ప్రక్కవాడి కష్టం – మన కష్టంగా తోస్తుంది – ప్రక్కవాడు పొందిన ఆనందం మనకు అనుభవమవుతుంది. సర్వజీవులలో ఉన్న సద్గురు స్వరూపం అప్రయత్నంగా అనుభవమవుతుంది.



***వారి అడుగులో అడుగులే పునాదులు...... నిలిచిపోయే ప్రేమసౌధాలు...***

సద్గురుపథమంటేనే అనుభూతి ప్రదం. **'ఆధ్యాత్మికత అంటే ఆనందంగా జీవించడమే'** అని ఆధ్యాత్మికను ఇంత సులభంగా నిర్వచించిన గురుచంద్రులు ఆధ్యాత్మిక చరిత్రలోనే లేరేమో! 'శ్రీసాయి' అన్న ఏ దైవం కోసమయితే తన జీవిత సర్వస్వాన్నీ ఆనందంగా అంకితమిచ్చారో ఆ సద్గురుచంద్రుడు చూపిన అడుగుజాడల్లోనే నడుస్తూ, ఆ అడుగుల అనుభూతులనే పునాదులుగా నిర్మించుకుంటూ మన కుటుంబాల్లో వారి ప్రేమ సౌరభాలను పంచుదాం. శ్రేయోదాయకమైన సాయిపథాన్ని, ఆనంద జీవనయానంగా మార్చుకున్న మనం సాయి సద్గురు పదాలను సాటివారితోనూ పంచుకుని మన 'మానవ నైజాన్ని' చాటుకుందాం... ***పూజ్య గురుదేవులు చూపిన బాటలో గమ్యంతో పాటు గమనాన్ని కూడా పవిత్రంగా మలచుకుంటూ రాబోయే తరాలకు "స్వచ్ఛతతోనూ, పరిపూర్ణతతోనూ కూడిన సాయిపథాన్ని" అందిద్దాం. ఇందుకు ఒక్కటే మార్గం "సాధ్యమయినంత సేపు త్రికరణాలను సాయి ధ్యాసలో, ఊసులో" ఉంచుకోవడమే. ఇది గురుచంద్రుల మాట.. ఇదే మన తరింపుకు బాట....*** **– గురుకృప**

## చిన్న ప్రశ్న

శ్రీకృష్ణుని స్పర్శలో, స్మరణలో తనను తాను కూడదీసుకుంటూ, ధర్మజునితో ఇలా అన్నాడు భీష్ముడు. "ధర్మజా! ఆకాశంలోని మేఘాలతో వాయువు జరిపే లీలలను నీవూ గమనిస్తూనే ఉంటావు కదా! ఆ వాయువే మేఘాలనొకదానికొకటిగా కలుపుతూ ఉంటుంది. మళ్లీ కాసేపటిలో వాటిని విడదీస్తూ ఉంటుంది. ఒకప్పుడు తనవల్ల ఇక్కడ చేరిన మేఘాలను తానే ఎక్కడెక్కడికో తరిమికొడుతుంది. ఇంకొకప్పుడు ఎక్కడెక్కడి మేఘాలను అంతలోనే ఇక్కడకు నడుపుకు వచ్చి నిలబెడుతుంది. ఇంతకూ ఇప్పుడు వాన ఎక్కడ పడుతుంది? వాయువు ఎక్కడ తలచుకుంటే అక్కడ! ఇదిగో ఇక్కడ పడబోతోందని మనమందరం అన్నీ సర్దుకుంటాం. సర్దుకునేలోపలే, సర్దుకొని మనం పైకి చూసే లోపలే, ఆ వాయువు – ఆ మేఘాలను ఎక్కడికో, ఎక్కడెక్కడికో తీసుకొనిపోయి, ఆ వానజల్లులతో వాటి ఉనికిని ఏమాత్రం గమనించని ఎవరెవరినో, ఎందరెందరినో అలా తడిపివేస్తూ ఉంటుంది. బయట నుండి లోపలికి వెళ్లేలోపలే వాళ్లందరూ తడిముద్దలయి కూర్చుంటారు. మళ్లీ వాళ్ళు దలలు తుడుచుకునే లోపల అక్కడ వాన ఉంటుందని చెప్పలేం! ఏమో ఆ వాయుదేవుడు

ఎప్పుడు ఎటు తలుచుకుంటాడో! మేఘాలు కదులుతూ, పరిగెడుతూ కనిపిస్తూ ఉంటాయి. కాని వాటిని కదిలిస్తున్న పరిగెత్తిస్తున్న వాయువు మాత్రం మనకు కనిపించదు. మనకున్న విచక్షణతో మనం అతడిని గమనించకుంటే తప్ప. నాయనా! ఈ మన మానవ జీవితాలలో నిరంతరం నడిచే సన్నివేశాలున్నాయే అవి ఆ ఆకాశంలోని మేఘాలలాంటివి. మేఘాలను వాయువు నడిపిస్తూ ఉన్నట్లుగా ఈ మన జీవిత సన్నివేశాలను కాలం నడిపిస్తూ ఉంటుంది. మేఘాలు వాయువశమై ఉన్నట్లుగా ఈ మన జీవిత సన్నివేశాలన్నీ కాలానికి వశమై నడచిపోతున్నాయి. ఏది ఎందుకు జరుగుతున్నది అన్నది ఆ కాలపురుషునికి మాత్రమే తెలిసేటటువంటి అంశం. మేఘాలనడకలను చూస్తూ, వాయుదేవుని యొక్క పోకడలను గమనించగలిగినట్లుగా, మనను చేరవస్తున్న సన్నివేశాలను చూడవలసిన రీతిలో చూడటం ద్వారా మనమా కాలపురుషుని పోకడలను గమనించుకోవలసి ఉంది.



లేకపోతే ఏమిటి చెప్పు. ఏమిటీ విచిత్రం! మామూలు కంటికి అసలేమయినా అంతుపడుతుందా అని. ధర్మరాజు రాజట. యుద్ధం చేస్తున్నవాడు గాండీవాన్ని ధరించిన అర్జునుడట. చక్రాన్ని చేతబట్టిన కృష్ణదేవుడు ఆ పార్థునికి సారథిట. తన గద యొక్క కదలికలతోనే శత్రురాజుల గుండెలను కంపింపచేయగలిగిన భీమసేనుడు ఆ కృష్ణార్జునులకు సహకారిట. అలాంటివారు అంతటంతటి వారు అలా ఒక్కటిగా కదలివచ్చిన కలసి వచ్చిన ఈ యుద్ధంలో వాళ్ళకు కూడా ఎన్నెన్నో బాధలు ఎదురు వచ్చాయంటే అనుకోని ఆపదలు, వారిని ముంచివేసాయంటే – ఏమిటిది? ఏమిటీ ఆశ్చర్యం? కాల పురుషుని లీలకాక మరేమిటిది? కాలపురుషుని లీలగా కాక దీనిని మనమెలా అర్థం చేసుకోవాలి.

మరి ఆ కాలపురుషుడే ఈ కృష్ణదేవుడు కదా! ఈయన చిత్రమయిన వాడు. ఏవి చెప్పాలో అవి చెబుతాడు తప్ప అన్నీ చెప్పడు. కథ ముందుకు సాగడానికి ఏవి కావాలో అవి చెబుతాడు తప్ప మిగిలిన వాటి ఊసెత్తడు. కాలపురుషుడే ఈయన అయినప్పుడు ఈయనకు ఇవన్నీ తెలియవని మన మనుకోగలమా! ఈ వైష్ణవ మాయను అర్థం చేసుకోవడం కష్టం. కష్టమనడం కన్నా అదొక ఆశ్చర్యం! ఇక్కడ ఈ కథలో కాలపురుషుడు తానయి వుండి కూడా తానూ మనతోపాటు ఒక పాత్రగా మసలుకోవడం అదెంతటి ఆశ్చర్యం!

"అది సరేగాని ధర్మజా! అలాంటి దేవదేవుని సన్నిధిలో నిన్ను ఒక చిన్న ప్రశ్న అడగాలని నాకనిపిస్తోందయ్యా! నాకు అనిపించడమో, ఆయన నాచేత అడిగించడమో, మొత్తం మీద ప్రశ్న



మాత్రం ఇది". భీష్ముడు కొద్దిక్షణాలపాటు ధర్మజునికి తెలియకుండానే ధర్మజుని గమనిస్తూ ఉన్నాడు. గమనించి అప్రయత్నంగా తల పంకించాడు. భేష్! ఏమిటి ఆ ప్రశ్న? అన్న కుతూహలం అతని ముఖంలో కనబడలేదు. ఆ ప్రశ్న ఏమయి ఉంటుందీ? అన్న ఒత్తిడిని కూడా అతని మనస్సు అనుభవిస్తున్నట్లు లేదు. అతడు సావధాన చిత్తుడై కనిపిస్తున్నాడు. నిండయిన శ్రద్ధతో కనిపిస్తున్నాడు. అంకిత భావంతో కనిపిస్తున్నాడు. అర్పణ భావంతో శోభిస్తున్నాడు. అనన్య చింతనలో కుదురుకొని ఉన్నాడు. "ఈ నా మనుమడు అవతార మూర్తికి ప్రీతిపాత్రుడు. తగిన జవాబులు చెప్పడంలో సర్వ సమర్ధుడని యక్షప్రశ్నల నాడే జగత్తునకంతటికీ ఇతడి దివ్య వైభవం తెలియచెప్పబడింది. అలాంటివాడిని, అలాంటి జగత్తునకంతటికీ ఇతడి దివ్య వైభవం తెలియచెప్పబడింది. అలాంటివాడిని, అలాంటి 'వాడి' కలిగిన వాడిని ఇప్పుడు ప్రశ్నించబోతున్నాను. అసలు ప్రశ్నిస్తే ఇలాంటివాడినే ప్రశ్నించాలి. అప్పుడది ప్రశ్న అవుతుంది. ఆ వచ్చినది సమాధానమవుతుంది." అనుకొంటూ భీష్ముడు మరొక్కసారి ధర్మజుని వైపుకు తేరిపార చూచాడు. అతడు అలాగే ఉన్నాడు. అదే దివ్యస్థితిలో ఉన్నాడు. అతడిలో ఎక్కడా తాత ఇంకా ప్రశ్నించడేమి! అన్న ఆత్రుత కనిపించడం లేదు. కుతూహలం, ఒత్తిడి, ఆత్రుత ఇలాంటి సంచలనాలకు అతీతమయిన సంయమస్థితిలో ఉన్నాడతడు. సర్వసమర్థుడూ, సర్వసన్నద్ధుడూ అతడు. యుద్ధమునందు స్థిరముగా నిలిచేవాడు కాబట్టి యుధిష్ఠిరుడు అని పేరు వచ్చిందతనికి. మామూలు యుద్ధం మాట అటుంచి, ఈ మానవ జీవిత సంగ్రామంలో తాను స్థిరంగా నిలిచాడు. తన తమ్ములను చెదరకుండా పొదవి పట్టుకున్నాడు. పేరుకు తగినవాడు. తరతరాలు పేర్కొనతగినవాడు.

తాతగా అలా ముచ్చటపడుతూ, ఆ మనుమడితో ముచ్చలాడుతున్నట్లుగా కథను ఇలా కొనసాగిస్తున్నాడు భీష్ముడు. "ధర్మజా! సావధాన చిత్తుడవై ఉన్న నీకు ఆ దేవదేవుని సన్నిధిలో వేస్తున్న చిన్న ప్రశ్న ఇది. సామాన్యంగా లోకంలో జీవితంలో కష్టనష్టాలు వచ్చినప్పుడు వాటిని గూర్చి ఎలా విశ్లేషిస్తూ ఉంటారో నీకు తెలుసును కదా! పూర్వజన్మలో ఏదో చేసి ఉంటాం. అందువల్ల ఇలా జరిగి ఉంటుంది" – అని సరిపుచ్చుకుంటారు కొందరు. "ప్రయత్నం చాలనప్పుడు ఇలాంటి ఇబ్బందులు రాక తప్పుతుందా? – అని ఆలోచిస్తుంటారు కొంతమంది. మనం ఎంతచేసినా దైవానుగ్రహం ఉండాలికదా! తానొకటి తలచిన దైవమొకటి తలచును'' – అని పెద్దలనడం మనం వినలేదా? మానవ ప్రయత్నం ఎంత జరిగినా దైవం కలిసిరానపుడు అది ఏమి ఫలిస్తుంది? – అని



పైకి చూస్తూ నిట్టూరుస్తూ ఉంటారు కొందరు. దీనిని బట్టి ఎంతవరకు తెలుస్తూ ఉన్నది? మనిషి జీవితంలో ఒడిదుడుకులు వచ్చాయి అంటే అది అతడి పూర్వకర్మ విశేషాన్ని అనుసరించి అయినా అయి ఉండాలి. లేక అతని మానవ ప్రయత్నమయినా చాలకపోయి ఉండాలి. లేదా దైవమయినా అతనికి కలిసిరాకపోయి ఉండాలి. ఏమంటావు? ఈ మూడింటిలో ఏ ఒకటో రెండో అంశాలకు అతడు గురియై, అతడా ఒడిదుడుకులు అనుభవిస్తూ ఉండి ఉండాలి. అవునా కాదా! చూడటానికి అలాగే అనిపిస్తూ ఉన్నది కదా!"

ధర్మజుడు సావధాన చిత్తుడై వింటున్నాడు. ఋషులందరూ ఒక్కక్షణం అటు తాతా మనుమల వైపు చూస్తున్నారు. మరుక్షణం ఇటు కృష్ణదేవుని వైపు చూస్తున్నారు. మరోక్షణం విశిష్టమయిన ఈ సన్నివేశం మొత్తాన్ని ఒకేసారి తమ చూపులలో ఇముడ్చుకొంటున్నారు. తాతా మనుమలు ఇద్దరూ జీవితాలే తపస్సులుగా సాగినవారు. శ్రీకృష్ణునిపై చూపెట్టుకొని తమ తమ జీవిత తపస్సులను కొనసాగించినవారు. ఇప్పుడా తాతా మనుమలు ఆ సారథి సన్నిధిలోనే మాట్లాడుకొంటున్నారు. మనస్సు విప్పి మాట్లాడుకొంటున్నారు. మానవజాతి మనస్సులోని ముడులను విప్పుతున్నట్లుగా మాట్లాడుతున్నారు. ఓహో! ఏమి విశిష్టమయిన సన్నివేశమిది! ఆహా! ఎంత అర్ధవంతమయిన సన్నివేశమిది! ఋషులు మరుస్తున్నారు. సారథి సరసంగా చూస్తున్నాడు సాగుతున్న సన్నివేశం వైపు.

ధర్మజుని వంక మరింతగా చూస్తూ భీష్ముడిలా అన్నాడు. "తండ్రీ! లోక సామాన్యమయిన భావనలను గూర్చి మనం చెప్పుకున్నాం కదా!" మరి ఇప్పుడు ఈ భావనలతో మీ కథను ఒకసారి పరిశీలించి చూద్దామా! మీరు ఆపదల పరంపరలను అనుభవిస్తూ వచ్చారని వేరే చెప్పనక్కరలేదు కదా! అయితే అన్ని ఆపదలు, అన్ని రకాల ఆపదలు మిమ్ములను దేని ప్రకారం ఎందువల్ల చుట్టుముట్టాయి? అన్నది ప్రశ్న. పూర్వకర్మ బంధాన్ని బట్టి, ఆ కర్మ విశేషాన్ని బట్టి, ఈ ఆపదలు చుట్టుముట్టాయని అనుకొందామా? అలాంటి వీలు ఏమాత్రం కనబడటం లేదు. ఎందువల్లనంటే మీరందరూ దైవాంశసంభూతులు. కారణజన్ములు. మీకు పూర్వకర్మల బంధం ఉండటానికి అవకాశమేది?

పోనీ, మానవ ప్రయత్నం చాలక మీరు ఈ ఇడుములకు లోనయ్యారందామా? మీకంటే సమర్థులు ఇప్పుడు ఈ లోకంలో ఎవరు ఉన్నారు. మీరు జగదేకవీరులు కదా! మీ ఆయుధాలు, మీ అస్త్రాలు తపస్సంపన్నమైనవి. దేవతలచే స్వయంగా మీకు అందించబడ్డవి. ఇక ప్రయత్నలోపమన్నది ఏ



కోశానా మీలో లేనేలేదే! సర్వసమర్థులయిన మీరు సర్వసన్నద్ధులయి నిరంతరం కర్తవ్య నిర్వహణం చేస్తూ వచ్చారు. మరి, అయినా ఈ ఆపదలు మిమ్మల్నెందుకు చుట్టుముట్టాయి? మీరు చేసినంతగా మానవ ప్రయత్నాన్ని చేసిన వారు ఈ భూమిమీద ఎందరుంటారు?

కాదు. కాదు. దైవానుగ్రహం చాలలేదు. అందువల్ల ఈ ఆపదలన్నీ పడక తప్పలేదు అని అందామా అంటే అందుకు అసలే వీలు దొరకదు. సాక్షాత్తూ దేవదేవుడే మీవాడై నిలిచాడు. మీలోని వాడై మెలిగాడు. మీ పనిని తన పనిగా బాధ్యత పడ్డాడు. మీకన్నివిధాలా సారథి అయ్యాడు. మీ గుర్రాల పోషణ దగ్గర నుండి, మీ పాత్ర పోషణ వరకు అన్నీ తానే చూచుకొన్నాడు. తానే మీరుగా, మీరే తానుగా నడిచాడు. నడుస్తున్నాడు. మిమ్ములను నడిపిస్తున్నాడు. మీ కష్టం తన కష్టంగా, మీ సుఖం తన సుఖంగా మీ విజయం తన విజయంగా, మీరే తన సర్వస్వంగా ఈ భూమి జనులు ఎప్పటికీ ఆశ్చర్యపడేలాగున తన అవతార కార్యక్రమాన్ని మీతో ముడివేసి,పెనవేసి నడిపిస్తున్నాడు. అతని కొరకు మీరు, మీ కొరకు అతను అన్నట్లు నడుస్తున్నది ఈ కథ. అలాంటప్పుడు అలా జరుగుతూ వస్తున్నప్పుడు ఇంక దైవానుగ్రహానికి లోటున్నదని అనగలమా? అసలు దైవానుగ్రహం పొందని చోటు మీ జీవితంలో ఎక్కడయినా ఉన్నదా! ఏమి ధర్మరాజా! ఏమంటావు?

కనుక. ఈ మీ విషయంలో పూర్వకర్మ బంధం ఉండటానికి అవకాశం లేదు. మానవ ప్రయత్నంలో లోటు జరిగిందేమోననడానికి ఏమాత్రం వీలు లేదు. దైవానుగ్రహం అందలేదేమో అనుకోవడానికి అసలు కుదరనే కుదరదు. మరి, ఇంత కుదురయిన కథలో ఈ కుదుపులేమిటయ్యా? ఈ కుదుపులేమిటి?"

సావధాన చిత్తురాలయి సన్నివేశాన్ని సాకల్యంగా గమనించుకొంటూ వస్తున్న కుంతీదేవి ఒక్కసారి మామగారివైపు తల పైకెత్తి చూసింది. ఆమె ముఖాన చిరునవ్వు వెలిసింది. ఆ ముఖాన్ని తన వైపుకు మామూలుగా వంచేసుకుంటూ, 'మామగారు ఆ యక్షుణ్ణే మరిపిస్తున్నారు' – అనుకొన్నది.

ధర్మజుడు వినమ్రుడై మనస్సుతో ఆ మహనీయునికి అంజలి ఘటిస్తూ ఇలా అన్నాడు: "తాతా! అవసరమయిన ప్రశ్న వేశావు. నీ వంటి పెద్దల అండదండల వల్ల, ఆశీస్సుల వల్ల నా జీవితంలో అడుగడుగునా అగుపిస్తూ, అనుక్షణం అనుభవానికి వస్తూ, క్షణం క్షణం నన్ను ముందుకు నడిపించిన దివ్యమయిన ఆ సమాధాన్ని మీ ముందు నివేదించుకొంటున్నాను. దుర్లభమయిన అవకాశంగా



లభించిన ఈ మానవ జీవితాన్ని నేను కేవలం నుదుటి వ్రాతన అమలుపరిచే కథగా చూడలేను. చూడను కూడా! ఇక, మీరు వివరించారే – లోకంలో సామాన్యంగా అందరూ అనుకునే ఆ మూడు అంశాలు – ఆ మూడు అంశాలకు కూడా దివ్యమయిన ఈ మానవ జీవితాన్ని ముడిపెట్టలేను. ముడిపెట్టను. అయితే, ఆ మూడు అంశాలనూ నేను అశ్రద్ధ చేయను. కాదనను. మానవజీవితం కర్మబంధాలకు అతీతంగా సాగవలసిందే. మానవ ప్రయత్నంలో ఏమాత్రం లోపం జరుగరాదు. ఏమరపాటు కలుగరాదు. దైవానుగ్రహమా అది అవశ్యం అవసరం. అసలది లేనిదే ఏదీ లేదు. అయితే ఈ జీవితం ఈ మూడింటికి మాత్రమే పరిమితం కాదు. అలా పరిమితం చేయబడలేదు. మానవ జీవితంలోని సన్నివేశాలు ఎందుకు ఎలా వస్తాయి అన్నదానికి ఇంకొకవైపు నుండి కూడా మనం చూడవలసి ఉంది కదా! ఆ ఇంకొకవైపు నుండి జీవితం చూడటం నేర్చుకోమనే కదా, మీలాంటి పెద్దలు అనాదిగా చెబుతూ వస్తున్నారు. అటునుండి, అనగా ఆ వైపు నుండి చూచినప్పుడు ఇదే జీవితం మరొకలా కనబడుతుంది.

జీవితంలో సన్నివేశాలు నడుస్తున్నాయి. నడిచివస్తున్నాయి. ఒకదాని వెంట ఒకటి వస్తున్నాయి. మన కర్మఫలాలుగా కాదు. మానవ ప్రయత్న లోపానికి బదులుగా కాదు. దైవానుగ్రహం లేదని చెప్పడానికి సంకేతాలుగా కాదు. మనకు అవసరమై ఆ సన్నివేశాలు నడుస్తున్నాయి. మన పాత్ర పోషణకు అవసరమై నడిచివస్తున్నాయి. జగత్కల్యాణ సాధనకు అవసరమై, దేవ దేవుని అనుగ్రహంగా, ఆయా సన్నివేశాలు రూపుదిద్దుకుంటున్నాయి. సృష్టి లీలలో భాగంగా ఆయా సన్నివేశాలు సాగిపోతున్నాయి. మనమూ ఆ లీలలో ఒకానొక భాగమేగా తాతా! జీవితాన్ని ఇలా చూడటమన్నది ఈ తల్లి ఒడి నుండే, ఈ తల్లి స్పర్శతోనే, ఈ అమ్మ పెంపకంలోనే నాకు అలవాటయింది. తాతా! ఇది ఈ తల్లి చూపిన బాట. నా దృష్టిలో ఈ తల్లి సాక్షాత్తూ ప్రకృతి మాత. ఆపదల పరంపరలు అనబడేవి – అన్నివైపుల నుండి చుట్టుముడుతున్నా ఈ తల్లి తాను బెదరలేదు. మమ్మలను చెదరనీయలేదు. ఈ జీవితాన్ని ఎలా చూడాలో అలాగే మేం చూచేటట్లుగా, కంటికి రెప్పలా కాచుకుంటూ వచ్చింది ఆ తల్లి. ఆ విషయంలో ఇప్పటికీ నాకు ఆమెచేత సాకబడుతూనే ఉన్నట్లుంటుంది. ఇప్పటికీ ఆమె నా వెన్ను నిమురుతూ, అంతలోనే ఆ వెన్ను తడుతూ ఉన్నట్లు ఉంటుంది. మీ వంటి మహనీయులను బోధపరచుకోగలిగినా, దివ్యమంగళ రూపులయిన వ్యాస, కృష్ణులకు చేరువయినా ఇదంతా ఈ తల్లి మాకు పెట్టిన భిక్ష! ఇవన్నీ ఈ తల్లి మాకు కట్టిన రక్ష!



జీవితంలోని సన్నివేశాలు మనిషి ఎదగడానికి వ్యక్తమవుతున్న అవకాశాలు. జీవితంలోని సన్నివేశాలు, మనిషి చేయవలసిన సాధనలోని భాగాలు. జీవితంలోని సన్నివేశాలు మనిషి పోషించవలసిన పాత్రకు ఆవశ్యకమయిన అంశాలు. జీవితంలోని సన్నివేశాలు జగత్కల్యాణ సాధనలో భాగంగా భగవంతుడు, మనకు అనుగ్రహిస్తున్న దివ్యలీలా విశేషాలు. తెలిసి బ్రతికిన బ్రతుకే తపస్సు! ఇలా అని తెలిసి బ్రతికిన బ్రతుకే తపస్సు! తాతా! ఈ తల్లి స్పర్శలో నిరంతరం నేనందుకొన్న బోధ ఇది. ఈ తల్లి దయవల్ల జీవితంలో బోధలే నడిచాయి తప్ప, బాధలు మాకు అగుపడలేదు. జన్మ ఎత్తినందుకు మానవుడు ధీరుడయి ఎలా జీవించాలో ఉగ్గునాటి నుండి ఈమె మాకు ఉపదేశిస్తూనే వచ్చింది. ఆమె మాలో పాదుకొలిపిన ధీరత్వమే అవతారమూర్తితో చేతులు కలిపి నడిచే పాత్రతను మాకు సిద్ధింపచేసింది. తాతా! నిజం చెప్పనా! కృష్ణదేవుని చూస్తున్నా, నాకు ఒక్కొక్కప్పుడు మా అమ్మను చూస్తున్నట్లే అనిపిస్తుంది. అంతర్యామిలో నిలిచిన మా తండ్రి... అమ్మను మాకప్పగించినందుకు మాకు అన్నీ ఆ అమ్మే అయింది. ఇది తాతా! ఆ అమ్మ చేసిన అక్షరాభ్యాసం! ఇది తాతా! ఆ అమ్మ గరిపిన విద్యాబోధన! ఆమే మమ్ములను గురువుగా నడిపించి జగద్గురువునకు తగిన పరివారంగా మమ్ములను తీర్చిదిద్దింది. నా దృష్టిలో ఆమే అమ్మ. ఆమే వ్యాసుడు. ఆమే కృష్ణుడు. ఆమే అంతా!" భీష్ముడు కదిలాడు. భీష్ముడు కరిగాడు. ధర్మజుని తన గుండెలకు హత్తుకొన్నాడు. కృష్ణుడు తన రెండు చేతులనూ వారిద్దరిపై వేశాడు. ఇద్దరూ తనవారే అసలు వారిద్దరూ తానే అన్నట్లుగా నిలిచాడు. ఋషిలోకం ఆర్ద్రమైంది. తానే ఆ సన్నివేశమయింది అదే అనుభూతిలో నిలిచివుంది. తల్లి కుంతి వినమ్రురాలైంది. చేతులు జోడించింది. 'నా జన్మ ధన్యమైంది' అన్నట్లుగా ఉంది.ఆకాశం పూలవాన కురిపించింది. లోకాల మధ్య తెరలను కాసేపు తొలగించింది.పరీక్షిత్తు పరవశుడవుతున్నాడు. పరితృప్తుడవుతున్నాడు, పండిపోతున్నాడు. శుకయోగీంద్రుడు నిశ్చలుడై నిలిచాడు. నిండుగా గోచరించాడు.

**– శ్రీమద్భాగవతము దివ్యజీవన మార్గము**

*నీకన్నా అత్యంత ప్రీతిపాత్రుడని భావించి భగవంతుణ్ణి ప్రార్థించు. నిజం చెబుతున్నాను, భక్తుడంటే ఆయనకు అత్యంత అనురాగం. వారికి దర్శనం ఇవ్వకుండా ఉండలేదు. తనను కోరుకోక మునుపే భక్తుల వద్దకు ఆయన వచ్చేస్తాడు. ఒక వ్యక్తి భగవన్ముఖంగా ఒక అడుగు వేస్తే, ఆయన ఆ వ్యక్తి వైపు పది అడుగులు వేస్తాడు. భగవంతుని కన్నా సన్నిహితంగాను, ఆప్యాయంగాను మరెవరూ ఉండలేరు.*

**- శ్రీరామకృష్ణులు**

# గురుకృపాలహరి



**ధాత్రిజనుల కెల్ల తగ నెరిగించెద**

**నొనరు హరు నెరంగు నుపము యొకటి**

**మనసు చెదరనీక మహిమతో జూచుటే!**

**విశ్వదాభిరామ వినుర వేమ!**

"వేమా! తరించాలన్న తపన కల్గిన జీవులకు నేను చెప్పే ఉపాయమిది – ఎవరి మనసయితే స్థిరత్వాన్ని, నిర్మలత్వాన్ని పొందుతుందో వారు తప్పక భగవంతుణ్ణి కనుగొంటారు" అని అంటాడు 'ప్రజాకవి' – మేలుకొలుపు 'రవి' వేమన. మనసు స్థిరము, నిర్మలమయ్యేదెట్లా? సాధ్యమయ్యేనా? శంకర భగవత్పాదులంతటి వారు "ఓ పరమేశ్వరా! నా మనసు కోతి వంటిది. అది ఎప్పుడూ సంసార వాంఛ అనే అడవిలో తిరుగుతూ ఉంటుంది. భార్యాపుత్రుల ప్రేమ అనే చెట్టుకొమ్మను పట్టుకొని వేలాడుతూ ఉంటుంది. క్షణం తీరిక లేకుండా అటూ ఇటూ పరుగులు తీస్తుంటుంది. అందువల్ల నా మనసు అనే కోతిని నీకు అర్పిస్తున్నాను. దాన్ని తాడుతో గట్టిగా కట్టి నీ అధీనంలో ఉంచుకో" అని ప్రార్థిస్తారు. మనసుకు అంతులేని కోర్కెల కడలిలో స్థిరత్వం–నిర్మలత్వం లభించాలంటే ఏది దారి? కళ్ళకు కనిపించని, చెవులకు వినిపించని భగవంతుని ఉనికిని ఎలా హృదయగతం చేసుకోగలం? అవసరాలకంటే కోర్కెలకే ప్రాధాన్యతనిచ్చే మానవ జీవితంలో స్థిరత్వం చిక్కేదెట్లా? ఒక్కటే మార్గం "మహాజనో యేన గతః సపన్థాః" మహాత్ములు నడిచిన బాటలో మనమూ నడవడం. ఏ మహాత్ముల ద్వారా భగవంతుని ఉనికి మన మదికి తెలిసిందో వారి ఆచరణను మన జీవితంలోని ప్రతీ తావులోనూ త్రికరణ శుద్ధిగా పాటించడం, వారి ఆచరణను, ఆ 'సత్య'పథగాముల అడుగులను దర్శించడానికి–ఆయా సత్పురుషుల సన్నిధిని ప్రసాదించే వారి సత్యచరిత్రలను విధిగా పరాయణత్వంతో పఠించడం, మనం ఎంతగా ఆ మహితాత్ముల చరిత్రలలో లీనమవుతామో వారి వారి లీలా తరంగాల ద్వారా వారు పాదుకొల్పిన విలువలు మనలో అంతగా ఇంకిపోతాయి, మన నిత్యజీవితంలో జరిగే ప్రతీ సంఘటనలోనూ, వారి ఆచరణాత్మక బోధలు వ్యక్తమవుతాయి. అవ్యాజమైన, నిర్హేతుకమైన వారి ప్రేమ సుమాలు మనలో శోభిల్లి మానవతా పరిమళాలుగా గుబాళించి సాటివారిని సత్ప్రేమపథంలో నడిపేందుకు దోహదమవుతాయి. మరో మాటలో చెప్పుకోవాలంటే "మకిలి పట్టిన మనసులను శుభ్రం చేస్తూనే – మానవత్వం నుండి దైవత్వం వైపు సాగే పయనానికి రహదారులు మహాత్ముల

**కోల్పోవడం ద్వారా పొందడమనేది ఏదైనా ఉంటే అది కేవలం ప్రేమలో మాత్రమే. –శ్రీబాబూజీ**



చరిత్రలు.”

మానవ జీవిత లక్ష్యాన్ని ఎలా సాధించుకోవాలో తెలియచెప్పే అర్ధవంతమైన శాంతిమంత్రాలు ‘మహాత్ముల చరిత్రలు’. నిజానికి వాటి విలువను తెలుసుకునేంత విజ్ఞాన, వివేకాలు మాకు లేవు. దీపస్తంభాల వంటి ఈ చరితామృతాలను మా చేత పానం చేయిస్తున్న సత్ప్రేమమూర్తి, జ్ఞానదీప్తి ‘శ్రీబాబూజీ’. కేవలం వారి కరుణా విశేషంగా మాత్రమే మాలో లేశమంతైనా సత్సంకల్పబీజాలు మొలకలు వేసాయి. మేము వేసే ప్రతీ అడుగు వారి ప్రేమ ప్రణాళికలోని భాగమే! వారి ‘ప్రేమబానిస’లుగా బ్రతకడమే మాకు శ్రేయోదాయకం. పూజ్య పరమాచార్యుల జీవిత ప్రస్థానాన్ని సాయిపథగాములు సద్దర్శనం చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని అవగతమవుతుంది.

శ్రీసాయి “పూచిక పుల్లనైనా గురువుగా విశ్వసించి చూడు! లక్ష్యాన్ని తప్పక చేరతావు” అని చెప్పారు. గురువునెలా విశ్వసించాలో గురువు చూపిన మార్గంలో నడవడంలో ఎంత అప్రమత్తతతో మెలగాలో, ప్రాణాలను కూడా లక్ష్యపెట్టక గురువుకు, గురువు చూపిన ఆదర్శాలకు ఎలా తన, మన, ప్రాణాలను అంకితమిచ్చి జీవించాలో పూజ్య పరమాచార్యుల జీవితంలోని ప్రతీ అడుగులోనూ దర్శించవచ్చు. ఈ సాయి సద్గురుయానంలో స్ఫూర్తితో మనం ఆచరించవచ్చు– ఆలోచనలు వారివి – అడుగులు మనవి. ఆలోచిస్తే మహాత్ముల సచ్చరితలు మనం మన గురుచంద్రునితో ఎట్టి అనుబంధాన్ని కలిగి ఉండాలో – ఆశ్రయించుకున్న ఆ అమృతమూర్తి చెంత ఎట్లా జీవన సాఫల్యాన్ని పొందాలో తెలియచెపుతాయి. మెల్లగా కంచి కథలోకి వెళ్దాం. పండిత మదన మోహన మాలవ్యా లాంటి సారస్వతులే జగద్గురువుల పట్ల చూపిన గౌరవ భావాలను తెలుసుకుంటే మన నడవడిక, గురువును గౌరవించుకోవాల్సిన తీరు స్పష్టంగా అవగతమవుతాయి.

వరుణ, అసి అనే రెండు ఉపనదులు గంగానదితో కలిసే భూభాగాన్ని వారణాశి, కాశీ, బెనారస్ పేర్లతో పిలుచుకుంటారు. గంగానది ఇక్కడ ఉత్తరంగా ప్రవహిస్తుంది. సుమారు మూడువేల సంవత్సరాల పురాతన చరిత్ర కల్గిన స్థలంగా, “కాశ్యాంతు మరణాన్ ముక్తి:”– కాశీలో మరణించిన వారికి ముక్తి లభిస్తుంది అన్న విశ్వాసంతో మోక్షపురిగా, ప్రపంచ ప్రఖ్యాతి పొందిన బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం ఉండడంతో విజ్ఞానపురిగా ప్రసిద్ధి పొందింది కాశీ పట్టణము. విశాలాక్షి, విశ్వనాథుడు విరాజిల్లే నగరం కాశీ. ఇక్కడి మణికర్ణికా ఘట్ట సమీపంలో ఉండే – ఆది శంకరులు భాష్యగ్రంధ



రచన చేసినట్లు – వీరు జగద్గురువులుగా వ్యక్తమయ్యి వారి దిగ్విజయ యాత్రను ఇచ్చోట నుండే ప్రారంభించినట్లు చరిత్ర తెలియచెప్తుంది. కాశీక్షేత్ర మహిమను కొనియాడటానికి ఒక పుస్తకము సరిపోదన్నది సత్యము. ఎందరో మహాత్ముల పదస్పర్శచే పునీతమయిన కాశీ క్షేత్రమునకు పరమాచార్య స్వామి వారు వేంచేయడం, నాడు జరిగిన స్వాగత సంరంభ మహోత్సవము చరిత్ర పుటల్లో సువర్ణాక్షరాలతో లిఖించబడి ఉండడం జగత్ విదితమే. మరో విశేషమేమంటే **మా గురుదేవులు శ్రీబాబూజీ శ్రీచరణులు కూడా కాశీని దర్శించడం – వారి పదస్పర్శచే పునీతమయిన ఆ క్షేత్రమును తలుచుకోవడం అంతులేని ఆనందాన్ని కలుగచేస్తోంది.**

ప్రయాగ నుండి కాలినడకన కాశీ పట్టణ పొలిమేరలు చేరిన మూడు రోజుల తర్వాత అక్టోబర్ 6వతేదీ, 1934వ సం॥ పరమాచార్య స్వామి కాశీ పురప్రవేశం చేసారు. పండితులు, సన్యాసులు, పుర ప్రముఖులు, పూర్ణకుంభ స్వాగతంతో స్వామి వారికి స్వాగతం పలికారు. లక్షమంది జనులు ఆ స్వాగత సమారంభంలో పాల్గొన్నారంటే భక్తులకు స్వామివారి పట్ల గల ప్రేమను మనం అర్థం చేసుకోవచ్చు. స్వామివారిని దర్శించుకున్న భక్తుల ఆనందం అంబరాన్నంటింది. జయజయధ్వానాలు కొన్ని కిలోమీటర్లు ప్రతిధ్వనించాయి. "మానవుల మధ్య నడయాడే మహోన్నత దైవం" అని పెద్ద స్వాగత ద్వారం ఏర్పాటు చేయబడింది. అక్కడే ఏర్పాటు చేయబడిన ఒక పెద్ద వేదికపై స్వామివారికి నమస్సులర్పించి కాశీపుర ప్రజల తరుపున స్వాగతం పలికారు కాశీ మహారాజు, యువరాజు – అక్కడ నుండి వినయపూర్వకంగా స్వామివారిని అనుగమించి అక్కడి ఉద్యానవనంలో జగద్గురువులకు పాదపూజను చేసుకుని తరించారు ఆ రాజ కుటుంబీకులు. కామాచ్ఛ విడిది వద్ద రాజలాంఛనంగా ఏనుగులు, గుర్రాలు, ఒంటెలు, విజయపతాకాలు, బ్యాండ్‌మేళాలు స్వాగతం పలికాయి జగద్గురువులకు. రావుసాహెబ్ మాధవరం సంత్ విడిది గృహం వరకు సాగిన ఆ యాత్ర ఇరవై ఐదు వేల మందితో ప్రారంభమయి లక్షమంది పురజనుల హృదయసీమల్లో చెరగని అనుగ్రహముద్రను వేసింది.

స్వామి శివానంద బ్రహ్మచారి విజయపతాకాన్ని ధరించి గజారూఢుడై ముందు నడువగా ఆ వెనుక ఏనుగుపై పరమాచార్యుల చిత్రపటంతో ఊరేగింపు సాగింది. నాటి ప్రజల ప్రేమాభిమానాల ఆర్తికి–స్వామివారు సుమారు పదిసార్లు పల్లకీపై నిలబడి దర్శన ఆశీర్వాదములనిచ్చి దీవించవలసి



వచ్చిందంటే మనసు తన్మయస్థితిని పొంది పదాలు దొర్లడం లేదు. ఆనాటి రాత్రే పరమాచార్యస్వామి అన్నపూర్ణా విశ్వేశ్వరులను దర్శించుకున్నారు. అక్టోబర్ 7వ తేదీన స్వామివారు మణికర్ణికా ఘట్టములో స్నానమాచరించి విశ్వనాథుని ఆలయంలోనే చంద్రమౌళీశ్వర పూజను చేశారు. నాటి నుండి కాశీ పుణ్యక్షేత్రములోని ఎన్నో ధార్మిక సంస్థల భిక్షా వందనములను స్వీకరించడం, ఎన్నో జగత్‌హిత హోమములు నిర్వహించడం జరిగాయి. కాశీ క్షేత్రములోనే స్వామివారు నవరాత్రులను గడపడం – విజయదశమి పర్వదినాన పరమపావన గంగాతీర్థంలో పుణ్యస్నానమాచరించి దానాలను అందచేయడం జరిగాయి. వేలాదిమంది భక్తులు ఈ మహత్తర ఘట్టాన్ని దర్శించి తరించారు.

పూజ్య పరమాచార్య స్వామివారు కాశీ క్షేత్రంలోని ఎన్నో పవిత్ర ప్రదేశాలను దర్శించి ఆయా అధిష్టాన దేవతలకు నమస్సులు అర్పించారు. భారతరత్న, బెనారస్ హిందూ విశ్వవిద్యాలయ స్థాపకులు పండిత మదనమోహన మాలవ్యా ఆహ్వానాన్ని పురస్కరించుకుని బెనారస్ హిందూ విశ్వవిద్యాలయాన్ని వారి చరణస్పర్శతో పునీతం చేసి విద్యార్థులకు తమ అనుగ్రహ భాషణంతో దిశా నిర్దేశం చేయడానికి ఒప్పుకున్నారు స్వామి. పరమాచార్యుల ఆగమనాన్ని పురస్కరించుకుని విశ్వవిద్యాలయం శోభాయమానంగా అలంకరించబడింది. ఆచార్యులు, అధికారులు, విద్యార్థులు అందరూ స్వామిరాకకై ముఖద్వారం వద్ద ఎదురుచూచి స్వామివారిని స్వాగతించారు. ముఖ్యులైన వారిని మాలవ్యా స్వామివారికి పరిచయం చేసి, విశ్వవిద్యాలయ బోధనా ప్రణాళికను, విశ్వవిద్యాలయ విభాగాలను స్వామికి విన్నవించారు. పిమ్మట స్వామివారికై ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆసనంపై కొలువుదీరమని అభ్యర్థించారు. మాలవ్యా తన ప్రారంభోపన్యాసంలో స్వామివారిపై రచించిన ఐదు సంస్కృత శ్లోకాలను ప్రార్థనాపూర్వకంగా విన్నవించాడు. వాటిలోని సారాంశం – " ఏ మహితాత్ముని చరణకమలాలను ధ్యానించడం ద్వారా అజ్ఞానము హరించబడుతుందో ఎవరి దివ్యవాక్కులు ఈ ప్రపంచమంతా ప్రతిధ్వనిస్తున్నాయో, ఎవరి జీవితమైతే అంతర్లీనంగా ఉన్న శాస్త్ర సారములన్నింటిని ప్రతిబింబిస్తుందో, ఎవరైతే ఆదిశంకరుల కంచిపీఠమును అధివసించి ఉన్నారో వారికి మా నమస్సులు." "మీ జ్ఞానము, ధర్మనిష్ఠ, తపస్సు, కరుణ, ఆశీర్వాదములచే భారతభూమి అదృష్టం చేసుకుంది – భారతీయులు పవిత్రులైనారు". "దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి జ్ఞాన సముపార్జనకై ఇక్కడ చేరిన విద్యార్థులు, ఆచార్యులు, అధికారుల తరుపున మీ చరణ కమలాలకు అంజలి ఘటిస్తున్నాం." "ధర్మానికి గ్లాని



కలుగుతున్న ఈ రోజుల్లో విశ్వమానవాళికి హితం చేకూర్చే మీ అమృతవాక్కులకై ఎదురుచూస్తున్నాం. ప్రాక్పశ్చిమాలలో అనుసరించే విద్యాబోధనలను అనుసరించి విద్యాభ్యాసం సాగే ఈ విశ్వవిద్యాలయంలోని వారు, దేశ ప్రజలు మీ దిశానిర్దేశంతో పవిత్రులగుదురు గాక!"అంటూ స్వాగతోపన్యాసము చేశారు శ్రీమాలవ్యా.

పరమాచార్య స్వామి వారు తమ కృపావర్షాన్ని భాషణంగా ఆశీర్వదించారు. "జ్ఞాన సముపార్జనకు చివరి లక్ష్యం – మనఃశాంతి. చిత్తాన్ని ఎంత ప్రశాంతముగా ఉంచుకోగలమో అంతే ఆనందమును పొందగలము. స్వార్థము, దుఃఖము మనిషిని ప్రశాంతతకు దూరము చేయగలవు. తమ దుఃఖనివృత్తికై చేసే కార్యములలో ప్రక్క వారిని బాధించడం సబబు కాదు. తద్వారా వ్యవస్థలో చెలరేగే అస్తవ్యస్థతను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వాలు చట్టాలు చేయవలసి వస్తుంది. ఎంత అశాంతి అధికమైతే – అన్ని చట్టాలు తీసుకురావాల్సి వస్తుంది. ఏనాడైతే జనులు తమ ప్రాపంచిక కోర్కెల కంటే అంత:శాంతికి ప్రాధాన్యతనిస్తారో ఆనాడు వారు దు:ఖాలకు దూరం అవుతారు. ఇది కేవలం సుజ్ఞానం (విద్య) ద్వారానే సాధ్యం. ఈ విశ్వవిద్యాలయంలో చదువుకోవడం ద్వారా మీరందరూ ఉత్కృష్టమైన చిత్తశాంతిని పొందేందుకు అవకాశముంది. ఇక్కడి ఆచార్యులు అందుకు అవసరమైన బోధనను గావించి మీలో (విద్యార్థులలో) అట్టి శాంతిని పాదుకొల్పడం వారి ధర్మం. మీరు పొందిన శాంతి, ఆనందాలను జనులందరిలోనూ నింపడం ద్వారా – ప్రభుత్వాలు – పోలీసు, ఆర్మీ వంటి శాఖలపై ఖర్చులను కూడా తగ్గించుకోగలుగుతాయి.

మన ప్రాచీన విద్యావిధానపు అంత్యలక్ష్యం అంత:శాంతిగానే ఉండేది. వైజ్ఞానిక ప్రగతి – విద్యావిధానములో మార్పు కూడా మానవుని ఆధ్యాత్మిక ప్రగతికి సహకరిస్తే జనులు, దేశము రెండు కూడా శాంతికి నిలయమై అద్భుతమైన ప్రగతిని సాధించవచ్చు. మరోవంక ఇంద్రియాలను కట్టడి చేయకపోతే కోర్కెల కల్లోలంలో స్వార్థమునకు, దు:ఖమునకు, మానవజీవితము ఆలవాలమై పోగలదు. విద్య మీకు సంపదను కూడా ఇవ్వగలదు. ఆ సంపదను ధార్మికంగా ఖర్చు చేస్తూ అమరత్వాన్ని సిద్ధించుకోవచ్చు. విద్య ఈ ప్రాపంచికంగా లభించే వస్తు సముదాయములకంటే ఉత్కృష్టమైనది. ధర్మబద్ధంగా జీవించడం, భగవంతునికై తపించడం, దైవాన్ని పూజించడం ద్వారా మీరు మీ ఆత్మ స్వరూపాన్ని తెలుసుకోగలరు. మన భావితరాలకు (పిల్లలకు) సత్ప్రవర్తనను, దైవారాధనను, నీతివంతమైన జీవితాన్ని మన ఆచరణ ద్వారా అందించాల్సిన అవసరాన్ని మీరందరూ గుర్తించాలి.



చిన్నవయసు నుండే వారికి సత్యము, ధర్మము, సంస్కృతి, నైతిక విలువలను మీరు తెలియచెప్తారని ఆశిస్తున్నాను.

ఈ విశ్వవిద్యాలయం నుండి రాజర్షులుగా ఉత్తీర్ణులై ప్రజాసంక్షేమానికి, పరిపాలనా సౌలభ్యానికి తోడ్పడతారని ఆశిస్తున్నాను. దుర్లభమైన మానవజన్మను సార్థక మొనరించుకుని సన్మార్గములో నడిచి, సారస్వతులై, దేశాన్ని ముందుకు నడిపే క్రమంలో నిర్భీతిగా (ధైర్యంగా) ముందుకు సాగిపోదురు గాక! అట్టి ధర్మాచరణ ద్వారా మీరందరూ శ్రేయస్సును, కీర్తిని పొందురు గాక!" అని దీవించారు స్వామి. తమ స్వల్పవ్యవధి ముగింపు ప్రసంగంలో "ఆదిశంకరుల అపర అవతారమైన మీ దర్శనంతో, మా అజ్ఞానాన్ని పటాపంచలు చేసి మార్గనిర్దేశం చేసిన మీ భాషణంతో మేమందరం ఆనంద పరవశులమయ్యాము. ఆచార్యులు, అధికార, అనధికారులు, విద్యార్థులు, నేను మీరు చూపిన బాటలో నడుస్తామని సవినయంగా తెలియచేసుకుంటున్నాను. మమ్మందరినీ దీవించండి" అని మాలవ్యా ప్రార్థనాపూర్వకంగా వినయాంజలి ఘటించాడు. ***(పైన పేర్కొన స్వామివారి భాషణం సంక్షిప్తమైనదని పాఠకులకు మనవి).***

స్వామివారి అనుగ్రహ భాషణం విద్యార్థులకే కాదు నేటి విశ్వ మానవాళికి. 'ప్రమాద్యంతం విత్త మోహేన మూఢం" అంటుంది కఠోపనిషత్తు (2:6) విత్తమోహంలో పడి మనిషి మనస్సు దిక్కు తెలియక పరిభ్రమిస్తున్నది. జ్ఞాన సముపార్జన – ధనార్జనకై అర్రులు చాచిన రహదారిగా మారిన సమాజంలో నైతిక విలువలకు ఎక్కడ చోటుంటుంది. అంత:శాంతే అంత్యలక్ష్యంగా సాగవలసిన మన విద్యాలయాలు, అన్వేషణా స్ఫూర్తిని రగిలించి, సాటి జీవుల శ్రేయస్సులకై తపిస్తూ, విజ్ఞాన మథనం సాగించి, భరతజాతి కీర్తి పతాకను విశ్వవినువీధిలో ఎగుర వేయాలి. ఆనాడే జగద్గురువుల వాణికి మనమందరం నిజమైన గౌరవాన్ని తెచ్చిన వారమవుతాం.

పరమాచార్యస్వామి వారు రాంఘాట్‌లోని వేదవిద్యాలయాన్ని సందర్శించారు. కాశీ మహరాజు, యువరాజు, అధికారులు, వేదపండితులందరూ స్వామివారిని దర్శించుకున్నారు. అక్కడి వేదపండితులు స్వామివారిని కీర్తిస్తూ దశశ్లోకములను సమర్పించుకున్నారు. స్వామివారి ప్రశ్నలకు విద్యార్థులు చెప్పిన సమాధానాలు స్వామివారికి తృప్తినిచ్చాయి. రాజుగారు కూడా ఒక శ్లోకం రచించి స్వామి చరణాల చెంత సమర్పించుకున్నారు. వ్యాస, శంకరులపై స్వామివారు చేసిన భాషణం అందరినీ కట్టిపడేసింది. హనుమాన్ ఘాట్‌లోని ఆదిశంకరుల చిత్రపటాన్ని – శంకర మఠమునకు తీసుకురమ్మని



రాజుగారిని ఆజ్ఞాపించారు స్వామి – రాజుగారు శంకరులతో పాటు వేదవ్యాసుని చిత్రపటాన్ని కూడా తమ రాజభవనం నుండి తీసుకువచ్చారు. వ్యాసశంకరులను పరమాచార్యస్వామివారు శంకరమఠంలో ప్రతిష్ఠించగా – వారిద్దరి ప్రక్కనే పరమాచార్యుల చిత్రాన్ని శోభాయమానంగా ప్రతిష్ఠించారు కాశీరాజు. పురజనుల కంటికి ఆనందపు విందు అయింది ఆ మహోత్సవం.

సుమారు ఐదున్నర మాసాలు కాశీలో ఉండి భక్తజనుల ఆర్తిని తీర్చిన తర్వాత మార్చి 9వ తేదీ, 1935వ సం॥ వీడ్కోలు సభ ఏర్పాటు చేయబడింది. పురప్రముఖుల ఆధ్వర్యంలో నాడు అక్కడి పండిత, పామర ప్రజాప్రసంగములలో స్వామి వారి రాకతో వారిలోని 'భక్తి' ఉప్పెన రూపుదాల్చెనని అర్థమయ్యింది అందరికీ. "ఆదిశంకరుల అడుగుజాడలలో తాము కూడా ఈ యాత్ర చేపట్టామని – జనులందరిపై ఆ విశ్వనాథ, విశాలాక్షి, అన్నపూర్ణల అనుగ్రహాశీస్సులు అందరిపై వర్షించాలని, ప్రజలంతా శాంతి, సోదర భావములతో వసిస్తూ ధర్మమును అనుగమించి జీవించాలని" దీవించారు స్వామి. ఊరేగింపుగా విశ్వనాథుని ఆలయం వరకు సాగిన ఆ యాత్ర ఆదిశంకరుల పెద్ద చిత్రపటం విశ్వనాథుని ఆలయంలో కొలువుదీరడంతో ముగిసింది. మరో పండిత సభతో స్వామివారి కాశీయాత్ర ముగిసింది. మార్చి 20వ తేదీన రాజ్‌ఘాట్ మీదుగా పరమాచార్యస్వామి గయకు పయనమయ్యారు. మానవులైనా, మహీపతులైనా మహత్తర కార్యాలను సాధించాలంటే మహాత్ముల మార్గమే శ్రేయోదాయకము. 'నడయాడే దైవం' అన్నమాట ఎంత సుస్పష్టమో కదా – జాతిని అమూలాగ్రం లక్ష్యసాధన వైపుగా నడిపించేందుకు కైలాస శంకరుడు పరమాచార్యులుగా ప్రతీ భారతీయుని గడప వద్దకే నడిచివచ్చారు. నేటికీ భగవంతుడు సద్గురువులుగా మన మనో వాకిట్లలో నిలబడి – దారిచూపి, 'మనిషి దైవంగా' ఎదగాలని పరితపిస్తున్నారు. మా గురుచంద్రులు శ్రీబాబూజీ జీవితము, అలతి పదాల్లోనే అంతర్యామిత్వమును మాకు తెలియచెప్పిన ప్రేమాంతరంగము, మమ్ములను శ్రీసాయి చరణాలకు వారు కట్టి పడేసిన వైనము గమనించుకుంటే మా జీవితాలలో నడయాడిన ఆ 'దైవ' స్వరూపునికి కృతజ్ఞతగా, సత్ప్రవర్తనతో జీవించి, సాటివారిని ప్రేమించి నిజమైన మనుషులుగా చరించి, ఆ మహితమూర్తి పాదాలకు నివేదనగా నిలవడం కంటే మరో మార్గం లేదనిపిస్తుంది. అనంతమైన ప్రేమ వారిది – ఆయన బిడ్డలుగా మాలో మార్పు రాకపోతుందా అన్న ధీమా మాది. ఆశీస్సులు వారివి – అడుగు వేయాలన్న తపన మాది. తప్పక గమ్యం చేరుస్తానన్న వాగ్దానం



వారిది – వారి పాదాలు పట్టుకోగలిగితే చాలు గమ్యం చేరతామన్న విశ్వాసం మాది....
గురుదేవా! మీ తలపుల తన్మయత్వం చాలు.. తరించడానికి..సద్గురు చరణం శరణం...

– *గురుకృప*

## ఈ మార్గం ఎటు వెళ్తుంది?

ఈ అర్ధశతాబ్దంలో 1957-59 సంవత్సరాలు చెన్నై నగర చరిత్రలో సువర్ణ కాలం. అన్ని నెలలపాటు, మాంస నేత్రాలతో దర్శించినంతనే ఈ కలియుగంలో కూడా ఆశీర్వదించే అవతారమూర్తి, తత్వశ్రేష్టులు మహాపెరియవా అని ప్రపంచం మొత్తం వినుతించే కంచి స్వామి చెన్నైలో మకాం చేశారు. ముఖ్యంగా మైలాపూర్లోని సంస్కృత కళాశాలలో జయేంద్ర సరస్వతి స్వామి వారితో పాటు విడిది చేస్తూ, ఆ దివ్య చరణాలతో ట్రిప్లికేన్, నుంగంబాక్కం, తొండైయార్ పేట్, మాంబళం వంటి ఎన్నో చోట్లను పావనం చేస్తూ, ఒకప్పుడు పండి ఎండిపోయిన ధర్మ పంటను మరలా పండిస్తూ అనుగ్రహం చేశారు.

ఒకరోజు ఉదయం మాంబళంలోని శివ-విష్ణు దేవాలయం నుండి తిరువాన్మియూర్‌లో, శివుడు మరుందీశ్వరునిగా – స్వస్థత చేకూర్చే దేవుడు, అమ్మవారు త్రిపురసుందరి దేవిగా వెలసిన ఆలయానికి మహాస్వామివారు పాదయాత్రను ప్రారంభించారు. మహాస్వామి వారితో వెళ్తున్న భక్తులలో నేను కూడా ఉన్నాను. స్వామివారి పాదయాత్రలో ఇద్దరు ముగ్గురు రక్షకభటులు కూడా ఉన్నారు.

కొద్ది దూరం నడచిన తరువాత ఎదురుగుండా వస్తున్న ఒక వ్యక్తి స్వామివారిని అడ్డగించడానికి నిలబడ్డాడు. అహకారంతో చెప్పులు విప్పకుండా, నిర్లక్ష్యంగా నిలబడి ఉన్నాడు. అతను స్వామివారిని తాకకుండా ఉండడానికి చుట్టూ భక్తులు వలయాకారంగా నడుస్తున్నారు. రక్షకభటులు కూడా ముందుకు వచ్చారు. కాని ఆ కారుణ్యమూర్తి వారిని పక్కకు తప్పుకొమ్మని అతడిని, “నీకు ఏమైనా కావాలా?” అని అడిగారు.

“నాకు ఏమి అక్కరలేదు” అన్నాడు. “ఎవరో శంకరాచార్య, గొప్పవాడు అని అందరూ మాట్లాడుకుంటున్నారు, అది నువ్వేనా?” అని అడిగాడు.

“అది వదిలేయ్. నీ పేరు ఏమి? ఇంత ఉదయాన్నే ఎక్కడకు వెళ్తున్నావు?” అని ఒక తండ్రి పిల్లవాడిని అడిగిన రీతిలో ఎంతో ప్రేమగా అడిగారు స్వామివారు.



అతను తన పేరు చెప్పి, "నాకు ఏమి పనిలేదు అనుకున్నావా? నేను నా పనికి వెళ్తున్నాను" అని అన్నాడు. ఆ మాటల్లో పీఠాధిపతులైన మీరు సోమరులు, ఉపయోగపడేవి ఏమీ చెయ్యరు అన్న భావం కనబడుతోంది.

"నీ ఉద్యోగం ఎక్కడ?" ఆ దయానిధి మరలా అడిగారు.

"గిండిలో" అని సమాధానం ఇచ్చి, "నేను ఒకటి అడుగుతాను. ఈ హిందూ మతాన్ని స్థాపించినది ఎవరు?" అని అడిగాడు. ఆ ప్రశ్నలో వినయము, జిజ్ఞాస ఆవగింజంత అయినా లేదు.

జ్ఞానమేరు అయిన పరమాచార్య స్వామివారు, "అది నాకు తెలియదు వత్సా" అని అతను వాదన గెలవడానికి అనుగుణంగా సమాధానమిచ్చారు.

"నీకు తెలియదు అంటున్నావు. కాని నీవు శాస్త్రాలు అలా చెప్పాయి, ఇలా చెప్పాయి, రాతి విగ్రహం పైన పాలు పొయ్యి, అగ్నిలో నెయ్యి వెయ్యి అని చెబుతావు. ఇవన్నీ మంచికోసమే అని నేను ఎలా నమ్మాలి?"

శరాఘాతంలా వచ్చిన ఆ ప్రశ్నకు ఎటువంటి చలనం లేకుండా, ఆ దయాళువు ప్రేమ నిండిన మాటలతో, "అది వదిలేయ్. నువ్వు గిండికి వెళ్తున్నావు అని చెప్పావు కదా. ఈ దారి గుండా వెళ్తే ఆ స్థలాన్ని చేరుకుంటావా?" అని అడిగారు.

"చేరుకుంటాను కాబట్టే ఇలా వెళ్తున్నాను" ఆ సమాధానంలో ఇదొక అనవసర ప్రశ్న అన్న భావం కనిపించింది.

"సరే. ఈ రోడ్డు వేసినది ఎవరో?" మహాస్వామివారు ఆ నాస్తికుని హృదయ వీణను మ్రోగించడానికి సిద్దమయ్యారు.

"ఈ రోడ్డా? మా తాతలు, ముత్తాతలు, వాళ్ళ తాతల కాలం నుండి ఉంది. ఈ రోడ్డు ఎవరు వేస్తే ఏమి? ఇది గిండికి వెళ్తుంది అంతే",. "అంటే ఈ రోడ్డు ఖచ్చితంగా గిండికి వెళ్తుంది అంటావు". "అందులో సందేహం ఏముంది? నేను రోజూ ఇలానే పనికి వెళ్తాను. అంతేకాదు. అక్కడ చూడండి ఏ రోడ్డు ఎలా వెళ్తుందో అన్న సమాచారంతో ప్రభుత్వం వారు ఏర్పాటు చేసిన ఫలకం". స్వామివారి కరుణ అనే వలలో జింక పడింది. కాని ఇది బంధనం కాదు. విడుదల....

"నేను కూడా నీలాగే, వత్సా, నువ్వు ఆ ఫలకాన్ని నమ్మి వెళ్తున్నట్టుగా, రోడ్డు ఎవరు వేసారో అన్న ఆలోచన, అనుమానం లేకుండా హిందూమతం అనే రోడ్డుపై వెళ్తున్నాను. నువ్వు ఆ ఫలకాన్ని



నమ్ముతున్నావు. అది గాలికి తన దిశను మార్చుకోవచ్చు, లేదా వానకు పడిపోవచ్చు. మా తాతలముత్తాతల కంటే పాతవైన వేల వేల సంవత్సరాల నుండి ఉన్న వేదాలు, శాస్త్రాలను నమ్ముతాను. వారు కూడా వాటిని నమ్మారు. కనుక నేను కూడా వాటిని నమ్ముతాను, ఇతరులని నమ్మమంటాను" అని ముగించి, కరుణ నిండిన వాక్కులతో, "సరే, నాలా కాకుండా నీకు పని ఉంది. నువ్వు వెళ్ళు. క్షేమంగా ఉండు" అని తమ అభయహస్తాన్ని చూపారు.

మరుక్షణమే ఆ వ్యక్తి చెప్పులని విడిచి, నేలపై సాగిలపడి స్వామివారికి సాష్టాంగం చేశాడు. కళ్ళ నీరు కారుతుండగా, నాలుక తడబడుతుండగా, "నన్ను క్షమించండి" అని వేడుకున్నాడు. దాంతో, పదార్థం బంగారముగా మారే రసవాద పరిణామం వల్ల, అతను స్వామివారికి మహాభక్తునిగా మారి తరచూ స్వామివారి మకాంకు వచ్చేవాడు. **– కంచి పరమాచార్య వైభవం**

## Principle?<br>or Emotion?

**భక్తుడు:** Principle, Emotion ఏంటండీ ఇవి?

**గురువుగారు:** ఎమోషన్, ప్రిన్సిపుల్ అనేటువంటిది ఏంటి అనంటే, అర్థం కాకుండా మనం చెప్పేటువంటి మాటలే. ప్రిన్సిపుల్‌కు విరుద్ధంగా ఉండేటువంటి దానిని మనం ఎమోషన్ అని చెప్పి ప్రిన్సిపుల్‌ని violate చేయడానికి ఉపయోగపడుతుంది ఎమోషన్ అనేటువంటిది. నిజమైన ఎమోషన్‌కి ప్రిన్సిపుల్‌కి రెండింటికీ తేడా ఉండకూడదు. ఆ ప్రిన్సిపుల్ పట్ల మీకు ఎమోషన్ ఉండాలి – అలా ఉన్నపుడు నా ప్రిన్సిపుల్ మీ ప్రిన్సిపుల్స్ అవుతాయి. ఆ ప్రిన్సిపుల్స్ పట్ల మీకు ఎమోషన్ ఉంటుంది. కాబట్టి ప్రిన్సిపుల్సా? ఎమోషనా? కాదు అక్కడ ప్రశ్న. ప్రిన్సిపుల్స్ పట్ల ఒక ఎమోషన్ ఉండాలి. ఎమోషన్–ప్రిన్సిపుల్.... ఏది ఎమోషన్ ఏది ప్రిన్సిపుల్? అనేదానికి తేడా తెలియకుండా పోవడం.

మీరంటారు....గురువుగారు అపరిగ్రహం నియమం పెట్టుకొని ఉన్నారు. ఆయన ప్రిన్సిపుల్ అది అనని. నేను దాన్ని ప్రిన్సిపుల్‌గా అని ఏమి అనుకోవడం లేదు. నాకెవరూ ఆ నియమం పెట్టలా. నా ఎమోషన్ అది. నాకు నచ్చిందది. నాకు అది సంతోషాన్ని ఇస్తోంది. చెయ్యంటూ చాచితే బాబా ముందు చాచాలి. ఇంకెవరి ముందు చాచకూడదు. మన కష్టార్జితంతోనే తినాలి. ఎవరి దగ్గరా ఆయాచితంగా ఒక్క మెతుకు కూడా భోంచేయకూడదు. ఆ..... తీసుకోవడం తప్పా!



దక్షిణలు తీసుకోవడం తప్పా? డొనేషన్స్ తీసుకోవడం. తప్పొప్పుల గురించి నిర్ణయం తీసుకోవడానికి నేను ఎవరు. అదే రైటు కావచ్చు గాక. ఇదే తప్పు అయ్యుండొచ్చు. నేను కాదనటం లేదు. కాని నాకు నచ్చింది ఇది. తప్పైనా నాకు ఇది నచ్చింది. నేను అందుకనే వీళ్ళందరకూ చెప్తుంటాను.

బైబిల్లో భగవంతుడు ఇచ్చినటువంటి curse (శాపం) క్రింద చెప్తారు. so they had to "earn thy bread by the sweat of thy brow" అనని. నీ చెమటోడ్చి ఆ చెమట యొక్క కష్టంతో నువ్వు బ్రతకాల్సి వస్తుంది అని ఆ దేవుడు శాపం పెట్టాడు అని ఉంది. దాన్ని నేను శాపం అనుకోవటంలా. అది భగవంతుడు మనకిచ్చిన వరం అనుకుంటున్నా. ఎందుకంటే అది నాకు సంతోషాన్ని ఇస్తోంది. నా కష్టార్జితంతో నేను తినగలిగితే నాకొచ్చిన ఆనందం అయాచితంగా వచ్చిన దానితో తినటంలో నాకు కలగటంలా. నాకు ఇష్టం గనుక చేస్తున్నాను. ఏదో శాస్త్రాల్లో నియమం అపరిగ్రహం అని పేరు ఒకటి మళ్ళా దానికి, సంస్కృతం పేరు. వారెవరో నియమం పెట్టారు గనుక లేకపోతే ఫలానా వాళ్ళు ఎవరో చెప్పారు గనుక నేను చేయడంలా దీనిని. నాకు ఇష్టం గనుక చేస్తున్నాను. అది తప్పైనా చేస్తా. రైటైనా చేస్తా. అది నా ఎమోషన్. ఇది నా ప్రిన్సిపుల్. ఇవి రెండు విడివిడిగా లేవు నాకు.

అది ఒక నియమంగా పెట్టుకొని, దానిని ఎట్లాగైనా సరే బలవంతంగా లోపల మనస్సు అటుపోతున్నా, ఇటుపోతున్నా నిగ్రహించుకొని ఆ నియమం పాటించాలి అనేటువంటి తాపత్రయం ఏమి లేదు. ఏ నియమం అయినా అట్లాగే నాకు – ఏ ప్రిన్సిపుల్ అయినా అట్లాగే! అప్పుడు ప్రిన్సిపుల్‌కి ఎమోషన్‌కి తేడా లేకుండా పోతుంది. **– శ్రీబాబూజీ**

## మృష్టాన్న భోజనం

ఈ రోజుల్లో టీవీలలో ఎన్నో వంటల కార్యక్రమాలు వస్తున్నాయి. ఈ కార్యక్రమాల్లో ఇచ్చే సూచనలను సరిగ్గా అర్థం చేసుకుని వండితే, చివరగా తయారయ్యే పదార్థం తినడానికి యోగ్యంగా ఉంటుందా? అది అనుమానమే. కొత్త వంటకాలు ఏవీ లేకపోతె, సాధారణంగా చేసే మునక్కాయ సాంబారు లేదా బెండకాయ తాలింపు చేసే విధానాన్నే ఉపయోగించి కొత్త వంటలు చేస్తారు.



స్వామివారు పూర్వాశ్రమంలో ఎన్నడూ వంటింటికి వెళ్ళలేదు. సన్యసించిన తరువాత ఇక వెళ్ళాల్సిన అవసరం లేదు. కాని స్వామివారికి నలభీమపాకంలోని మెళకువలన్నీ తెలుసు. అంతేకాక కొత్త కొత్త వంటలు ఎలా చెయ్యాలో కూడా మంచి నేర్పు. మేము పండరీపురం నుండి తిరిగొస్తున్నాము. అయిదారు చిన్ని గుడిసెలు ఉన్న ఒక కుగ్రామానికి చేరుకున్నాము. ఒక పెద్ద చెట్టు కింద మకాం ఏర్పాటు చేసుకున్నాము. పరమాచార్య స్వామివారు భిక్ష పూర్తి చెయ్యగానే, మాకోసం కాస్త ఎక్కువగా వండిన పదార్థాలను ఆరగించి మా భోజనం కూడా పూర్తిచేశాము. అది మధ్యాహ్న విశ్రాంతి సమయం. హఠాత్తుగా పెద్ద కోలాహలంతో ఇరవై మంది వ్యక్తులు వచ్చారు. వారందరూ చెన్నై ప్రాంతం వారు. శ్రీమఠం మకాం కాబట్టి శ్రీచంద్రమౌళీశ్వర ప్రసాదంగా మంచి ఆహారం దొరుకుతుందన్న నమ్మకంతో అక్కడకు వచ్చారు. కాని అప్పుడు శ్రీమఠం ఒక పెద్ద చెట్టు కింద మకాం చేసి ఉంది. వండడానికి కావాల్సిన సరుకులు, పాత్రలు కూడా లేవు. ఇటువంటి విషయాల గురించి మహాస్వామివారు ఎక్కువగా కలతచెందేవారు కాదు. ఆకలితో వచ్చిన వారి కడుపు నింపడమే స్వామివారి లక్ష్యం.

బ్రహ్మచారి రామకృష్ణన్ అని స్వామివారు అంతరంగిక సేవకుడు ఉండేవాడు. “అందరికి ఆహారం తయారుచెయ్యి” అని అతణ్ణి ఆదేశించారు స్వామివారు. రామకృష్ణన్ చేతులు నలుపుతూ నిస్సహాయంగా నిలబడి, “మన మకాం తరువాతి ఊరికి వెళ్ళిన తరువాత వారికి వండి పెడతాను” అని తెలిపాడు. ఇబ్బంది ఉందని పరమాచార్య స్వామివారు అర్థం చేసుకుని, “బియ్యం ఉందా?” అని అడిగారు. “ఉంది, కాస్త పెసరపప్పు కూడా ఉంది”. “అయితే ఇంకేం! నువ్వు ఏం చేస్తావంటే, బియ్యాన్ని నానబెట్టి కడుగు, ఆ నీటిని మరొక పాత్రలో సేకరించు. దానికి కొద్దిగా ఉప్పు వేసి, నిమ్మకాయ పిండి, నారత్తె ఆకులను కత్తిరించి వెయ్యి. ఇది మజ్జిగ అవుతుంది. పెసరపప్పుని ఎక్కువగా నీరు పోసి ఉడికించు. నీటిని, పప్పును వేరుచేసి, ఆ వేడినీళ్ళకు నిమ్మకాయ వెయ్యి. ఇది రసం అవుతుంది. ఇప్పుడు ఉడికించిన పెసరపప్పు ఉంది కదా! దానికి కాస్త ఉప్పు, కత్తిరించిన మిరపకాయలు వెయ్యి. అది తాళింపు అవుతుంది” అని ఆదేశించారు. అరగంటలో మొత్తం సిద్ధం అయ్యింది. ఈలోగా మేము అతిథులకి భోజనానికి ఆకులు, నీరు సమకూర్చాము. మొత్తానికి షడ్రుచుల నాలుక కోసం అన్నం, పెసరపప్పు తాళింపు, రసం, మజ్జిగ తయారు అయ్యాయి.

“ఇది మృష్టాన్న భోజనం” అన్నారొక అతిథి.

“దేవామృతం” అని మరొకరు చెప్పారు.

“ఇంతటి రుచికరమైన భోజనాన్ని ఇంతకుముందెన్నడూ తినలేదు” అన్నారు మూడవవారు. ఆ మాటలను విని మాలో మేము నవ్వుకున్నాము. అది పరమాచార్యస్వామివారి వాక్కు వల్ల కలిగిన రుచి అని మాకు తెలుసు. ఆతిథ్యం అన్నది పరమాచార్య స్వామివారిని చూసే నేర్చుకోవాలి. అది ఒక అక్షయ పాత్ర.



– *శ్రీమఠం బాలు, మహా పెరియవాళ్ – దరిశన అనుభవంగళ్*

## ఆ చేయి ఎంత హాయి

**ప్రశ్న:** మీ ద్వారా నాకు “బాబా” పరిచయమైనారని నా ధృడవిశ్వాసం?

**జవాబు:** మౌనంగా ఉండిపోయారు. (నేను మాత్రం వార్ని అలా చూస్తూ ఉండిపోయాను. అలా చూస్తున్నప్పుడు ఎన్నో ఆలోచలు నాలో అంకురార్పణమై పెదవుల మీదికి మాటల రూపంలో దొర్లుతున్నాయి.)

**ప్రశ్న:** మీ ద్వారా నాకు “బాబా” అంటే ఏమిటో తెలిసింది, మొదట “బాబా” వైద్యునిగ, ఆ తరువాత దైవముగా, ఆ తరువాత అంతకన్న మిన్నయైన సద్గురువుగా, ఆ తరువాత సమస్తము బాబాయేనని, ఆయన ఆజ్ఞలేకుండా ఆకైనా కదలదును విషయము, “బాబా” కన్నా భిన్నమైంది ఏదీ లేదని ప్రతిదీ “బాబా”యేనని తెలియచేసారు?

**జవాబు:** ఆ...... ఆ తెలియజేసింది కూడా నేను కాదు. ఆయనే, “బాబా”ను గురించి నేను తెలుసుకున్నది అప్పుడప్పుడు మీకు చెప్పిన విషయాలు మీ హృదయానికి నచ్చుటానికి కారణం నా మాటలు కావు. ఆయన లీలలు, భక్తులను ఆయన ఆదరిస్తున్న తీరు, మహోన్నతమైన వారి చరిత్ర ఇత్యాదులు కారణాలు కావచ్చు.

**ప్రశ్న:** అలా ఎంతమంది ఎందరి హృదయాలకు హత్తుకొనేలా చెప్పగలరు. “బాబా లీలలు” గాని, సత్యాన్ని అంటిపెట్టుకొనిన వాస్తవాలేమిటో కంటి ముందు కదలాడు కథలలా! తిక్కన కవితలా! ఎవరు వర్ణించగలరు. ఎవరు చూపించగలరు. ఇంకెవ్వరికైనా అది సాధ్యమా?

**జవాబు:** బాబాను గురించి తెలిసిన వారెవరైనా సరే! అంత బాగ విశదీకరించగలరు. ఆ ఘనత ఆ గౌరవము “బాబా”దే గాని, వ్యక్తులదిగాదు.



**ప్రశ్న:** ఇప్పటికి ఎంతో మంది చెప్పారు. విన్నాము మీ అంత బాగా ఎందుకు చెప్పలేకపోయారు?

**జవాబు:** నన్ను మీరంతా ఎక్కువసార్లు కలుసుకొనే అవకాశం దొరికింది. అంతకుమించి "బాబా"ను గూర్చి తెలుసుకోవాలనే తపన మీ హృదయాలలో వున్నందున నా మాటలు నచ్చి వుంటాయి.

**ప్రశ్న:** మీ మాటలు నచ్చిన కారణంగానే గదా, మేమంతా "బాబా" భక్తులమైనది. అలాంటప్పుడు మీరే మా అందరికి..... ఇంకా అనబోతున్నాను?

**జవాబు:** నీ లాజిక్ నా దగ్గర పనిచేయదు, నీవు తర్కం చదువుకొని వుండవచ్చు. ఒక మాట నుండి మరోమాటకు లింకులు వేసి ఇరికించాలనుకొనే నీ వాక్చాతుర్యాన్ని మానుకో!

అద్దములో ప్రతిబింబము కనిపించినంత స్పష్టముగా నా బుద్ధియందలి ఆలోచనలు ముందుగానే వీరికెలా తెలిసాయి. మూసివుంచిన పుస్తకపు పుటలలోని వాక్యాలను శరద్బాబూజీగారెలా చదవగల్గినారు. నా ఊహ నాకు మాత్రమే స్వంతము గాదా? నా తెలివితేటలు నావి కావా? మున్ముందు నేనేమి మాట్లాడబోతానో ముందుగా వారికెలా గోచరమైనది. నా హృదయాన్ని ఇంత చక్కగా ఎలా చదవగల్గుతున్నారు? నా తర్కం వారికి ముందుగానే ఎలా తెలిసింది. నా భావార్థంలో వారెలా ముందుగానే విహరించగల్గుతున్నారు. నా అక్షరాల అలలలో వారెలా నౌక విహారం చేశారు. భవిష్యత్తును చూడగల్గుతున్నారే. ఆ కొద్ది కాలంలో నాలో రేగిన దుమారమే ఇదంతా! 1992 సం॥ గురువుగారి సన్నిధిలో, శిరిడీలో దసరా వేడుకల అనంతరం 1993 సం॥ తెనాలిలో జరగబోవు సాయిపూజా మహోత్సవాలకు రావలసిందని ప్రాధేయపడుటకు ముందుగా జరిగిన సంభాషణల సారాన్ని అతి సూక్ష్మంగా తెలియజేసాను. ఇంతగా సంభాషణ సాగటానికి కారణం లేకపోలేదు.

1992 సం॥లో తెనాలిలో సత్సంగాన్ని ప్రారంభించిన 25 వారాలకు చిన్న వేడుక జరుపుకొనినాము. బాబాపరంగా, అనుకోకుండా ఎస్.వి.ఎల్. గారు మరికొందరు గురుబంధువులు ఆరోజు అక్కడకు వచ్చారు. "సద్గురు సాయినాథుని శరద్బాబూజీ సత్సంగ సేవాసమితి" అన్న బ్యానరు కట్టించాము. ఎస్.వి.ఎల్.గారు మమ్మెంతగానో మెచ్చుకొనినారు. ఆ భావానందాన్ని గురుదేవుల ముందర వుంచినారు కాబోలు, వారం, పదిరోజుల తిరక్కుండానే నన్ను మందలిస్తూ (బాగుపడాలని) నా హృదయం గాయం కాకుండా లేఖను వ్రాసి పంపారు. ఆ లేఖ చదవగానే కళ్ళ వెంట ఆనందభాష్పాలు జలజల



రాలినవి. ఆ అనుభూతిని ఆ ఉత్తరములోని భావాలను తెలియపర్చాలనే ఉంది, కాని ఇప్పుడుకాదు. శిరిడీ వెళ్ళి గురువుగారిని తెనాలికి ఆహ్వానించాలని వెళ్ళాము. వారు ఉదహరిస్తూ వ్రాసిన ఉత్తరములోని మాటలు నాకు ఇష్టం లేక సమర్ధించటానికి నేను చేసిన ప్రయత్నం అంతా ఇంతా కాదు.

దట్టముగా పట్టిన కారుమబ్బులు గాలికి వీగిపోతాయి. కార్చిచ్చు పెనుతుఫానుకు ఆరిపోతుంది. ఎంత లావా విజృంభించినప్పటికి జలనిధిని ఏమీ చేయలేదు. అలము కొనిన చీకటిని వెలుగు చీల్చిపారవేస్తుంది. సందేహములు సర్పంలా బుసలుకొడితే గురువనే గరుత్మంతుడు సాక్షాత్కరించగనే – సందేహములనే సర్పం పారిపోతుంది. మన గురువుగారు అంతే. నాలాంటి వారిని ఎందరిని చూచి వుంటారు. అప్పటి సన్నివేశాన్ని మీ కళ్ళముందుంచే ప్రయత్నం చేస్తాను. మొత్తం మీద నా ప్రయత్నం విఫలమైంది వాదనలోగాని, తర్కం వలనగాని, మన దారిలోకి వారిని మళ్ళించలేమను విషయం తేటతెల్లమైంది. వారిని మన మార్గం వైపుకు మళ్ళించాలనుకోవటం అతిప్రయాసే. నా బుద్ధిని మరో మార్గంలో పయనింపజేస్తూ, వారిని మళ్ళీ ఈ క్రింది విధంగా ప్రశ్నించసాగాను.

*– డా॥ జి. సాయివరప్రసాదరావు*

**మా దారి... గురుదేవులు చూపిన సాయిప్రేమ రహదారి..**

**వారి అమృత హస్తాలతో అన్నం తిన్నాం వారి పావన స్పర్శతో 'సాయిబాబా' అని**
**అక్షరాలుదిద్దాం. మూర్తీభవించిన ఆనందపు అమ్మ వొడిలో సేద తీరాం.**
**కరుణ కొలనుగా మారిన కనుల సాంత్వనలో స్నానమాడి సంబరపడ్డాం.**
**ఎలా అలాగే ఉంటాం?**
**కులాలకుళ్ళుకు, మతాల మళ్ళకు, ఆడంబరాల ఆర్భాటాలకు**
**ఆమడ దూరంగా, తన్మయమైన హృదయాలతో, ఆనందమే హావభావాలుగా**
**సాయిగురుచంద్రుల జ్ఞాన సౌరభాలను ఆస్వాదించడమే లక్ష్యంగా,**
**గురుదేవుల ఆచరణే ఆదర్శంగా, వారి అభయమే ఆభరణంగా,**
**ప్రేమించడం, ప్రేమను పంచడమే ప్రపంచంగా, జిజ్ఞాసే జీవంగా,**
**అనుక్షణము అందంగా, ఆనందంగా, అసూయకు చోటులేకుండా,**
**ప్రతీ చోటును సద్గురుప్రేమ పూదోటగా మలుస్తాం.... సాయిబిడ్డలుగా గెలుస్తాం.**

*– గురుకృప*

**అన్ని అతివాదాలకు అతీతమైన సమన్వయ సాధనను, మధ్యేమార్గాన్ని శ్రీసాయి ఉపదేశించారు. -శ్రీబాబూజీ**



## అనుగ్రహ అభయం.. సద్గురు భక్త విజయం..

అవతరసీ తూ యేతా ధర్మాన్‌తే గ్లానీ
నాస్తీకా నాహీ తూ లావిసి నిజభజనీ
దావిసి నానా లీలా అసంఖ్య రూపానీ
హరిసీ దివాన్‌చే తూ సంకట దినరజనీ॥

ధర్మానికి గ్లాని కలిగినపుడు మీరు అవతరిస్తారు.
నాస్తికులలో కూడా భజించే భావాన్ని కలిగిస్తారు..
అసంఖ్యాకమైన రూపాలలో ఎన్నో లీలలను చూపుతున్నారు.
అహర్నిశలూ మీరు దీనుల సంకటాలను హరిస్తున్నారు...
అని భక్తుల మనోసంకటాలను హరిస్తున్న ఆ మోమిన్ వంశజుడైన శ్రీసాయినాథుని
వేనోళ్ళ కీర్తించి సాయినాథునికి 'జయజయ'ధ్వానాలు పలికాడు శ్రీకృష్ణ జోగేశ్వర్ భీష్మ...

ఈనాడు శ్రీసాయినాథుని వంశజులైన మా గురుదేవులు తమ కృపావర్షంతో మా అందరి మనోసంకటాలను హరిస్తున్నారు... మారిన తరం కోసం మారని మహితాత్ముడు మా అందరి మేలుకోరి మరల ఏతెంచారు మమ్ము అహర్నిశలు ఆదుకోడానికి..
గురుదేవా! మీ చరణాలకు అంజలిఘటించి వేడుకుంటున్నాం...
బిడ్డలందరి మనోసంకటాలను హరించండి... మా హృదయమందిరాలలో వసించండి...

– గురుకృప

*శా॥ నీ పేరున్, భవదంఘ్రి తీర్థము, భవన్నిష్ఠ్యూత తాంబూలమున్*
*నీ పళ్ళెంబు ప్రసాదముం గొనికదా నే బిడ్డనైనాడ! న*
*న్నీ పాటిం గరుణింపు మోపనిక నే నివ్వారికిన్ బిడ్డగాన్*
*జేపట్టందగు, బట్టి మానదగదో శ్రీకాళహస్తీశ్వరా!*

*తా॥ నీ నామస్మరణము, నీ పాదతీర్థము, నీవు నమలి విడిచిన తాంబూలము, నీకు నివేదన చేసిన ప్రసాదము వీనిని స్వీకరించి గదా నీ పుత్రుడనైనాను! నీకిట్లు కొడుకునైన తర్వాత మరెవ్వరికిని కొడుకుగా జనించలేను. నన్ను నీదరికి జేర్చుకొనుము. చేరుచుకొన్న తరువాత మరల విడిచి పెట్టగూడదు సుమా!*

**– శ్రీకాళహస్తీశ్వర శతకము**



ఇవన్నీ కూడా ఎక్కడొస్తాయంటే... ప్రతిఒక్కరు కూడాను ఆర్గనైజర్స్ క్రింద ఫీలవ్వడం, అందరూ పెత్తనాలు చేయడం, ఎందుకో అర్దం కాదు.. నేనూ చూస్తుంటాను. ఎవరైనా ఇక్కడ కూర్చుంటే, ఇక్కడ కాదు అక్కడ కూర్చో అంటారు. ఇక్కడ ఎందుకు కూర్చోకూడదో, అక్కడ ఎందుకు కూర్చోవాలో నాకైతే అర్థం కాదు. ఎందుకు కూర్చోవాలి? ఊరికినే వాళ్ళ పెత్తనం చూపించడానికన్నమాట. అంతే.

**గురుబంధువు:** గురువుగారూ, మనం ఏదైనా ఎదుటివాళ్ళకు చెప్పేటప్పుడు ముందు మనం ఆచరణలో పెట్టే చెప్పాలా?

**గురువుగారు:** ఆచరణలో పెడితే చాలమ్మా, చెప్పడం, చెప్పకపోవడం అనేది వేరే విషయం. అసలు మనం ఎందుకు చెప్పాలి అసలు? ఆచరణలో పెడితే చాలు. ఒకరికి చెప్పే పద్దతి మనకెందుకమ్మా? బాబా చూసుకుంటారు.

**గురుబంధువు:** గురువుగారూ, నాలోనే నాకు ఎక్కువ కోపం వస్తుంటుంది. అది ఎలా తగ్గించుకోవాలి? అంటే అది అహంకారం వల్ల వస్తుందా, లేకపోతే మరేదైనా కారణమా?

**గురువుగారు:** ఎవరికైనా కోపం వచ్చేది అహం దెబ్బ తినడం వల్లనే వస్తుంది. ఒకటి ఎక్స్‌పెక్ట్ చేసి ఆ ఎక్స్‌పెక్టేషన్ ప్రకారం జరగకపోతేనే కోపం వస్తుంది. ఎక్స్‌పెక్టేషన్స్ తగ్గించుకుంటూపోతే కోపం తగ్గిపోతుంది. పిల్లలు ఇలా ఉండాలి అని అనుకుంటాము. వాళ్ళు అలా ఉండకపోతే కోపం వస్తుంది. భర్త ఇలా ఉండాలనుకుంటాము. అలా ఉండకపోతే కోపం వస్తుంది. ఆఫీసులో వాళ్ళు ఇలా ఉండాలనుకుంటాము. అలా ఉండకపోతే కోపం వస్తుంది. సత్సంగంలో ప్రక్కనవాళ్ళు ఇలా ఉండాలని ఎక్స్‌పెక్ట్ చేస్తాము. అలా లేకపోతే కోపం వస్తుంది. ఎందుకొస్తాయి ఊరికినే కోపాలు? ఎక్స్‌పెక్టేషన్స్ అంతా. మన ఎక్స్‌పెక్టేషన్స్ ప్రకారం చుట్టుప్రక్కల వాళ్ళందరూ అలా ఉండాలని, వాళ్ళకీ ఉంటాయి కదా ఎక్స్‌పెక్టేషన్స్? వాళ్ళ ఎక్స్‌పెక్టేషన్స్ ప్రకారం మీరున్నారా?బాబా, బాబా మీద ఫోకస్. ఇంక ఏదీ, consideration, importance దేనికీ ఉండకూడదు, అంతే. బాబాని, బాబా యొక్క తత్వాన్ని, ఆయన యొక్క లీలాప్రబోధాన్ని మనం ఎలా  అవగాహన చేసుకోవాలి? సాయితత్వాన్ని మన నిత్య జీవితంలో భాగం ఎలా చేసుకోవాలి? ఇది చేసుకుంటూ, బాబామహిమని ఎంత ఎక్కువగా వీలైతే అంత ఎక్కువగా మనం ఎట్లా అనుభవించాలి? మన లైఫే ఆయన మహిమకు ఒక తార్కాణంలాగా ఉండాలి. మీకేమన్నా ఎక్స్‌పీరియన్సెస్ ఉన్నాయా అని ఎవరన్నా అడిగితే నా లైఫే ఒక ఎక్స్‌పీరియన్స్ అని చెప్పగలిగేటట్లుగా ఉండాలి. అట్లా అనుక్షణం, అనుక్షణం బాబా మహిమని మనం ఎక్స్‌పీరియన్స్ చేసేటట్టుగా ఉండాలి. అలా అవ్వడమే.. మన ధ్యేయం. మన గమ్యం! ఇదే గమ్యం. ఇదే లక్ష్యం క్రింద పెట్టుకోండి. అంతే! ఇక దేని వైపుకి, అది ఏదైనా సరే.. మన మనస్సు పోనివ్వద్దు.

- శ్రీబాబూజీ



**మా స్వామి చిరునవ్వు..**

**తలిస్తే చాలు తనువు పులకించిపోవు...**

చిన్నారి చిట్టితండ్రులకు 'శ్రీసాయి'దే ఆ నవ్వు...
బుజ్జాయి బుడతలకు భవితవ్యం ఆ నవ్వు...
నిత్యవిద్యార్థికి నిత్య నూతనం ఆ నవ్వు...
నవయువకునికి విజ్ఞానసర్వస్వం ఆ నవ్వు...
తపించే సాధకునికి సమాధానం ఆ నవ్వు...
అంతరంగ అన్వేషికి ఆసరా ఆ నవ్వు...
గురుతెలిగిన గృహస్తునికి గమ్యం ఆ నవ్వు...
దుఃఖజీవులకు ఎనలేని ధైర్యం ఆ నవ్వు...
అనుభవపూర్ణునికి తలింపు ఆ నవ్వు...
అనంతానంత ప్రేమకు ప్రతిరూపం ఆ నవ్వు...
సద్గురుసాయి..
జన్మజన్మలకు వారితో వుండే భాగ్యం మాకివ్వు...

**- సద్గురు నంది -**